
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 33.0
కనిష్ఠం 23.4
****




నల్లగొండ
5
గురువారం 7 ఆగస్టు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.90 (306.0414)	44,108	66,131
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643 (3.94)	464.90	620.42
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.8661)	29,401	45,112

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220

నకిలీలు ఇంటికే!



- కొనసాగుతున్న విచారణ
- అడ్డుకునేందుకు రాజకీయ ప్రయత్నాలు

నల్లగొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రెండేళ్ల క్రితం అక్రమంగా క్రమబద్ధీకరణ పొందిన ఇంటర్ అధ్యాపకుల్లో నకిలీలపై చర్యలకు రంగం సిద్ధమవుతుండగా, దీనిని తప్పించుకునేందుకు రాజకీయ పైరవీలు ఊపందుకున్నాయి. ఇంటర్ అధ్యాపకులుగా క్రమబద్ధీకరణ పొందిన వారిలో పలువురు నకిలీ ధ్రువపత్రాలు సమర్పించారని ఇంటర్ బోర్డుకు ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలో జూలైలో వరంగల్ ఆర్జేడీ అధ్యక్షతన విచారణ కమిటీని నియమించింది. ఈ కమిటీ ఇప్పటికే రెగ్యులరైన అధ్యాపకుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభించింది. పలువురి సర్టిఫికెట్లపై అభ్యంతరాలను నమోదు చేసినట్లు సమాచారం రావడంతో అప్రమత్తమైన నకిలీ అధ్యాపకులు రాజకీయ పైరవీలతో పోస్టులను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలుస్తోంది.

నకిలీలను గుర్తించిన విచారణ కమిటీ

ఆర్జేడీ కార్యాలయ అధికారులు తాజాగా విచారణలో నల్లగొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023లో రెగ్యులర్ అయినా లెక్చరర్ల ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాలకు చెందిన తెలంగాణలో అనుమతిలేని యూనివర్సిటీల సర్టిఫికెట్‌లను గుర్తించి ఆ వివరాలు నమోదు చేసినట్లు తెలిసింది. జిల్లాకు సంబంధించి 18మందికి చెందిన సర్టిఫికెట్లపై అభ్యంతరాలు నమోదు చేశారని సమాచారం. అదేవిధంగా సూర్యాపేట జిల్లా పరిధిలో ఆరుగురి పత్రాలపైనా అభ్యంతరాలు నమోదు చేసినట్టు తెలిసింది. వీటన్నిటినీ మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి తప్పుడు సర్టిఫికెట్లు అని తేలితే వారిని సర్వీస్ నుంచి తొలగించడమేగాక, క్రిమినల్ కేసులు సైతం నమోదు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. మరోవైపు విచారణను నిలువరించేందుకు, ఉద్యోగాలు కాపాడుకునేందుకు నకిలీ అధ్యాపకులు రాజకీయ పైరవీలు మొదలుపెట్టారు. ఓ కీలక మంత్రికి సన్నిహితుడి ద్వారా రాజకీయ ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఉద్యోగాలు పోకుండా కాపాడితే అందరూ కలిసి రూ.కోటి వరకైనా సదరు నేత ద్వారా అధికారులకు ఇస్తామని వర్తమానం పంపారని సమాచారం. అయితే అధికారులు మాత్రం ప్రధానంగా నల్లగొండ జిల్లా నుంచే ఫిర్యాదులు రావడంతో చర్యలు తీసుకోవడానికే మొగ్గు చూపినట్లు తెలిసింది. ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్‌కు ఈ నెలలోనే పూర్తి విచారణ నివేదిక అందిస్తారని, అనంతరం చర్యలు ఉంటాయని తెలుస్తోంది.

వ్యవసాయ యాంత్రీకరణ షురూ



- దరఖాస్తులను స్వీకరిస్తున్న వ్యవసాయశాఖ
- పకడ్బందీగా అమలుకు ఉన్నతాధికారుల సమీక్ష
- వచ్చే నెల 17 నుంచి పరికరాల పంపిణీ
- రైతులు అడిగిన కంపెనీ పరికరమే కేటాయింపు

ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం ప్రక్రియ ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మొదలైంది. గతంలో ఉన్న ఈ పథకానికి మార్పులు చేర్పులతో నూతన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా యాంత్రీకరణ పథకం అమలుకు వ్యవసాయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ

యాంత్రీకరణ పథకానికి ఉమ్మడి జిల్లాలో వ్యాప్తంగా ఈనెల 5వ తేదీ నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రూపొందించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో పలు సవరణలు చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకాన్ని వర్తింపజేసేందుకు ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు రూ.6.18కోట్లను కేటాయించింది. నల్లగొండ జిల్లాకు రూ.3.14కోట్లు, సూర్యాపేటకు రూ.1.84కోట్లు, యాదాద్రి జిల్లాకు రూ.1.24కోట్లు కేటాయించింది. అందులో కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులను, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను భరించనున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ ఇవ్వనుండగా, జనరల్ కేటగిరీ రైతులకు 40శాతం సబ్సిడీ వర్తిస్తుంది. ఈ పథకం ప్రస్తుత వానాకాలం నుంచి యాసంగి వరకు పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు. జిల్లా ఉన్నతాధికారులు మండల ఏఈవోలు, ఏవోలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పథకం అమలుకు ఆదేశాలు జారీ చేశారు.

దరఖాస్తుల చివరి గడువు 15

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి సంబంధించి ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తులకు తుది గడువు విధించారు. గతంలో దరఖాస్తు చేసిన రైతుల దరఖాస్తులను సైతం ఈ మారు పరిగణనలోకి తీసుకోవడంతో పాటు కొత్త దరఖాస్తులన్నింటినీ పరిశీలిస్తారు. గతంలో ఉన్న దరఖాస్తులతో పాటు కొత్త దరఖాస్తులను కలెక్టర్లకు పంపిస్తారు. మూడు జిల్లాల కలెక్టర్లు ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు వాటిని పరిశీలిస్తారు. ఒకవేళ దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు సంబంధించి కారణాలను రైతులకు తెలియజేస్తారు. 21 నుంచి 27వ తేదీ వరకు ఎంపికైన రైతుల నుంచి డీడీలు తీసుకుంటారు. 27 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు మంజూరు పత్రాలు అందజేస్తారు. అదే నెల 7 నుంచి 17వ తేదీలోగా రైతులకు పరికరాలు పంపిణీ చేస్తారు. కూలీల కొరత ఉన్న ప్రస్తుత మిగతా 8వ పేజీలో...

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



యాంత్రీకరణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం ఆదేశాల మేరకు అమలు చేస్తున్న ఈ పథకాన్ని రైతులకు చేరవేస్తాం. యాంత్రీకరణ పథకం రైతులకు ఎంతగానో ఉపయోగంకానుంది. ఆధునిక పరికరాలతో వ్యవసాయం చేయడం వల్ల సమయం ఆదా కావడంతో పాటు అధిక దిగుబడులకు కూడా అవకాశం ఉంటుంది. ఈ నెల 15 వరకు దరఖాస్తులు తీసుకొని లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసిన అనంతరం సెప్టెంబరు 17లోగా పరికరాలను అందజేస్తాం. అర్హులైన ప్రతీ రైతుకు పథకాన్ని వర్తింపజేస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ రైతులకు 50శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40శాతం సబ్సిడీ ఉంది.

● పి. శ్రవణ్‌కుమార్, జేడీఏ

ఈ-పాస్ ద్వారా ఎరువులు విక్రయించాలి

జేడీఏ శ్రవణ్‌కుమార్



రికార్డులను పరిశీలిస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

డిండి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు ఈ-పాస్ యంత్రం ద్వారానే ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని డిండి, తవక్లాపూర్ సొసైటీలతోపాటు రైతు ఆగ్రో సేవా కేంద్రం, సాయి ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిలువలను అడిగి తెలుసుకున్నారు. ఎరువులు కొనుగోలు చేసే రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. ఎరువుల నిల్వల వివరాలు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఏవో రెహానా, సీడ్‌ఫామ్ ఏవో రామలింగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కొత్త విధానం

మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్‌ఆర్



విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

మిర్యాలగూడ, మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి కొత్త విధానం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపు మైదానంలో నిర్వహించిన లిటిల్ ఛాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రికెట్ జట్టును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతీ పూర్వ జిల్లాలో క్రీడా పాఠశాల, ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో మినీ స్టేడియాలను ఏర్పాటు చేసేలా క్రీడాపాలసీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడా కోటాలో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు పొందాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మానాయక్ మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థులు కప్ గెలుచుకోవడం ఆనందంగా ఉందన్నారు. పోటీల్లో ఆల్‌రౌండర్ ప్రతిభ కనబర్చిన యోగిరామ్ మ్యాన్ ఆఫ్‌ది సిరీస్, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా సాయికిరణ్ ప్రత్యేక బహుమతులు అందుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణకాంత్‌నాయక్, స్వామి, ఉపేందర్, ముంతాజ్‌బేగం, తావురియా, అనిత, జ్యోతి, స్పందన, అశ్విని, భవాని, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలను ప్రభుత్వమే నిర్వహించాలి

సాగునీటి సంఘాల జిల్లా అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి



ఎత్తిపోతల పథకంలోని మోటార్లను పరిశీలిస్తున్న శశిధర్‌రెడ్డి

వేములపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సాగర్ ఎడమకాల్వపై ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహించి రైతులను ఆదుకోవాలని సాగునీటి సంఘాల జిల్లా అధ్యక్షుడు పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సాగర్ ఎడమకాల్వపై ఎత్తిపోతల పథకాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. దశాబ్దకాలం క్రితం సాగర్ ఎడమకాల్వ ఆధునికీకరణలో భాగంగా గతంలో ఎత్తిపోతలలోని మోటార్ పంపుసెట్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు మాత్రమే చేశారని అన్నారు. ప్రస్తుతం మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైనింగ్‌లు మరమ్మతులకు గురై అస్తవ్యస్తంగా మారాయన్నారు. వాటి మరమ్మతులకు లక్షల రూపాయలు ఖర్చవుతోందని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అంచనాలు వేస్తున్నారే తప్ప నిధులు మంజూరు కావడం లేదన్నారు. ఈఎన్‌సీ ఆఫీసులో కమిటీ పరిశీలన చేసి నిధులు మంజూరు చేయడంలో జాప్యమవుతోందని, తామేమి చేయలేమని, రైతులే నిధులు సమీకరించుకోవాలని ఎన్నెస్పీ అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఎత్తిపోతల నిర్వహణ బాధ్యత వెంటనే తీసుకోవాలన్నారు. ఈఎన్‌సీ కమిటీతో సంబంధం లేకుండా నేరుగా మరమ్మతులకు నిధులు కేటాయించి ఆయకట్టు రైతులకు నీరందించాలన్నారు. అదేవిధంగా సిబ్బందిని సైతం ప్రభుత్వమే నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు కొమ్మగాని ఎల్లయ్య, సోమనబోయిన సైదులు, నాగయ్య, వెంకన్న, లింగయ్య, ఎరుకలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



కేతేపల్లిలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కేతేపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏపీఎంలతో కేతేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. అధికారులు సమర్పించిన ప్రగతి నివేదికలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కాకపోవడానికి ఆయా మండలాల అధికారులు తెలిపిన కారణాలు సహేతుకంగా లేవన్నారు. ఇళ్ల నిర్మాణాల బాధ్యత మండల స్థాయి అధికారులపైనే ఉందన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు చొరవ తీసుకుని నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. ఈ నెల 13 వరకు అన్ని మండలాల్లో ఇళ్ల నిర్మాణాల్లో 20శాతం పురోగతికి చేరుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు ఇసుక, సిమెంట్, ఇతర సామగ్రిలో సమస్యలు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. 'మన ఇసుక-మన వాహనం' ద్వారా ఇసుక అందించేలా తహసీల్దార్‌లు, ఆర్డీవోలు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఇంటిని నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేనివారిని గుర్తించి సమభావన సంఘాల ద్వారా రూ.లక్ష రుణం ఇప్పించేందుకు ఈ నెల 8వరకు జాబితాలను బ్యాంకులకు అందజేయాల్సిన బాధ్యత ఏపీఎంలదేనన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్లు రమాదేవి, పి.వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, జి.కృష్ణ, ఎంపీడీవోలు బి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, జయలక్ష్మి, ఉమేష్, జ్ఞానప్రకాశ్, పాల్గొన్నారు.

అన్ని రకాల వైద్య సేవలను అందించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల ద్వారా అన్ని రకాల వైద్య సేవలను అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం మాన్యంచెల్క పట్టణ వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఓపీ, ఏఎన్‌సీ, మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పక్కనే నిర్మిస్తున్న మాన్యంచెల్క యూపీహెచ్‌సీ నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించి, పనులు పూర్తయినందున ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, తదితరులు ఉన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు



మిర్యాలగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మిర్యాలగూడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించడంతో గాడి తప్పిందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు విమర్శించారు. గత నెల 30వ తేదీ నుంచి చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర ముగింపు సందర్భంగా బుధవారం పట్టణంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విద్యారంగం పూర్తిగా గాడితప్పిందన్నారు. సంక్షేమ రంగాన్ని పూర్తిగా విస్మరించడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. పెండింగ్‌లో ఉన్నా స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో ఎన్నడూ విద్యారంగ సమస్యలపై క్యాబినెట్‌లో చర్చించకపోవడం శోచనీయమన్నారు. పలు పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్ల వసతి లేదని ఆరోపించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు భోజనానికి కేవలం రూ.10 చెల్లిస్తుండడంతో ఏజెన్సీలు అప్పు చేసి వడ్డించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పాఠశాలలను అభివృద్ధి చేయకుండా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో 5వేల మందిని ఒకే చోట ఉంచి చదివించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎనిమిది రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పర్యటించి సమస్యలను అధ్యయనం చేసిన యాత్రా బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మూడావత్ రవినాయక్, పరుశరాం, వరలక్ష్మి, ధీరావత్ శ్రీను, కుర్ర సైదానాయక్, కుంచం కావ్య, కోరి రమేష్, రవిందర్, కిరణ్, స్పందన, జగదీశ్, వినోద్ సిద్దు, శంకర్, సూర్య, పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు చెల్లించాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

దేవరకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.10వేల వేతనం అందజేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. దేవరకొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులు అప్పులు చేసి భోజనం వండుతున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారి అయూబ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జూలూరి వెంకట్రాములు, మల్లయ్య, నోముల ధనలక్ష్మి, వెంకటమ్మ, శోభరాణి, మౌనిక, బుజ్జమ్మ, పాల్గొన్నారు.



చేనేతకు చేయూత

- కాంగ్రెస్ హయాంలో పలు పథకాలకు కొత్త రూపు
- అధికారులు సమన్వయంతో పనిచేస్తే నేతన్నలకు లబ్ధి

7

మెనూ ప్రకారం భోజనం అందించాలి



కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

డీఈవో భిక్షపతి

నిడమనూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు మెనూ పాటిస్తూ బాలికలకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు, వంటగది, స్టోర్ రూము, పరిసరాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. బాలికలు, సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో సివిల్ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. పలు పాఠ్యాంశాలపై విద్యార్థినులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులకు సంబంధించి ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, బాలికలకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఎంఈవో లావూరి వెంకన్న, పాఠశాల ప్రత్యేకాధికారి పద్మారాణి ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

నల్లగొండ క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని అదనపు ఎస్పీ రమేష్, సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ ఆడిటోరియంలో ప్రగతి కళాశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. విద్యావంతులే సైబర్ నేరాలబారినపడి మోసాలకు గురవుతున్నారని అన్నారు. అందుకే సైబర్‌నేరాలను అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్న సైబర్ నేరాలపై అంతా జాగ్రత్తగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఎంఎస్‌లు, ఈ-మెయిల్స్, వాట్సప్, ట్విట్టర్ ద్వారా వచ్చే బ్లూకలర్ లింకులను క్లిక్ చేసి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, సైబర్‌క్రైం ఎస్ఐ విష్ణు, టూటౌన్ ఎస్ఐ సైదులు, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

అమృత్..ఆలస్యం

- మందకొడిగా అమృత్-2 పనులు
- ఇప్పటి వరకు జరిగిన పనులు 34 శాతమే
- తాగునీటి ఎద్దడి నివారణకు రూ.491.39 కోట్లు

6

ప్రతి ఇంటికీ మంచినీరు

● ఉమ్మడి జిల్లాలో రూ.491కోట్లతో అమృత్-2 పనులు
● 2026 డిసెంబరులోగా పూర్తయ్యేలా ప్రణాళికలు
● ప్రజారోగ్యశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు


ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రతి ఇంటికీ మంచినీటి సరఫరాతో పాటు పట్టణాలు పరిశుభ్రంగా ఉంచాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టిన అమృత్-2 పథకం పనులు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొనసాగుతున్నాయని ప్రజారోగ్యశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కందుకూరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే మంచినీటికి సమస్య ఉండదని అంటున్నారు. రూ.491కోట్లతో కొనసాగుతున్న అమృత్-2 పథకం పనులపై ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

● ఆంధ్రజ్యోతి, రామగిరి

ఆంధ్రజ్యోతి: అమృత్-2 పనులు ఎక్కడెక్కడ, ఎంత వ్యయంతో జరుగుతున్నాయి?

ఎస్ఈ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చిట్యాల, చండూర్, హాలియా, నకిరేకల్, నందికొండ, నేరడుచర్ల, తిరుమలగిరి, ఆలేరు, చౌటుప్పల్, మోత్కూర్, పోచంపల్లి, యాదగిరిగుట్ట, కోదాడ, భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ, మిర్యాలగూడ మునిసిపాలిటీల్లో రూ.491.39కోట్లతో మంచినీటి సరఫరా పనులు కొనసాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి : యూజీడీ పనులు ఎకడెక్కడ కొనసాగుతున్నాయి?

ఎస్ఈ : నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట మునిసిపాలిటీల్లో రూ.706.03కోట్లతో అండర్ గ్రౌండ్ పనులు(యూజీడీ) కొనసాగుతున్నాయి. అదేవిధంగా నల్లగొండ మునిసిపాలిటీకి రూ.216.19, మిర్యాలగూడలో రూ.173.07, సూర్యాపేటలో రూ.316.77కోట్లతో పనులు కొనసాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: మంచినీటి సరఫరాలో ట్యాంకులు, పైపుల నిర్మాణం సంఖ్య ఎంత?

ఎస్ఈ : ఉమ్మడి జిల్లాలో 70మంచినీటి ట్యాంకులు, మంచినీటి సరఫరాకు 716 కిలోమీటర్ల మేర పైపులైన్ పనులు కొనసాగుతున్నాయి. అదేవిధంగా 611కిలోమీటర్ల మేర యూజీడీ పైపులైన్ పనులు జరుగుతున్నాయి. మొత్తంగా 1327కిలో మీటర్ల మేర మంచినీటి సరఫరా పైపులైన్ పనులు కొనసాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి : అమృత్-2 పనులు పూర్తయ్యేది ఎప్పుడు?

ఎస్ఈ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 2024 జూలైలో పనులు ప్రారంభమయ్యాయి. 2026 మార్చి వరకు గడువు ఉంది. డిసెంబరులోగా పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకొని పనులు చేయిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఈ పనులు ఇప్పటివరకు ఎంత మేర అయ్యాయి ?

ఎస్ఈ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జూలైలో ప్రారంభించిన పనులు ఇప్పటివరకు 34.5శాతం మేర పూర్తయ్యాయి. నల్లగొండ మునిసిపాలిటీలో 45శాతం పైగా పూర్తయ్యాయి.

ఆంధ్రజ్యోతి : చెరువులు, కుంటల సుందరీకరణ పనులు ఏమైనా ఉన్నాయా?

ఎస్ఈ : చెరువులు, కుంటల సుందరీకరణ కోసం అమృత్-2 స్పెషల్ ట్రాంచ్ పథకం ద్వారా రూ.54.17 కోట్లతో 17మునిసిపాలిటిల్లో పనులు చేపట్టేందకు టెండర్లు పిలిచాం. అనుమతి కోసం సీవోటీకి పంపాం. అనుమతి రాగానే పనులు ప్రారంభమవుతాయి.

ఆంధ్రజ్యోతి : ఎస్‌పీటీ పరిస్థితి ఎంటి ?

ఎస్ఈ : స్వచ్ఛభారత్ మిషన్-2 లో భాగంగా 16 మునిసిపాలిటీల్లో రూ.412కోట్లతో ఎస్‌పీటీ(సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) పనులు చేపట్టబోతున్నాం. టెక్నికల్ అనుమతి కోసం పంపాం. ఈ పనులు కూడా త్వరలోనే జరుగుతాయి. అదేవిధంగా యూఐడీఎఫ్ పథకంలో భాగంగా ట్రాన్స్ -1, ఫేస్- 1 లో కోదాడ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రేనేజీ నిర్మాణం కోసం రూ.258కోట్లతో టెండర్లు పిలిచాం.

అమృత్..ఆలస్యం

● మందకొడిగా అమృత్-2 పనులు ● ఇప్పటి వరకు జరిగిన పనులు 34 శాతమే
● తాగునీటి ఎద్దడి నివారణకు రూ.491.39 కోట్లు ● 17మునిసిపాలిటీల్లో ముందుకు సాగని పనులు

పాత మునిసిపాలిటీల పరిధి విస్తరించడంతో పాటు 2018లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 మేజర్ గ్రామపంచాయతీలకు మునిసిపాలిటీలుగా హోదా కల్పించారు. గతంలో జిల్లాలో ఉన్న ఏడు మున్సిపాలిటీలను కలుపుకుని మొత్తం 19పురపాలికలు ఉన్నాయి. వీటిలో 17 మునిసిపాలిటీల్లో తాగునీటి ఎద్దడి నివారణ కోసం అమృత్-2లో రూ.491.39 కోట్లు నిధులు మంజూరు చేశారు. రెండేళ్లలో వార్డుల్లో తాగునీటి సరఫరాకు అవసరమైన పైపులైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణంతో పాటు ఇంటింటికీ నల్లాలు అమర్చే పనులు పూర్తిచేసి తాగునీటి ఎద్దడిని నివారించాలని నిర్దేశించినప్పటికీ సుమారు 16నెలలు ముగిసినా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 30శాతం పనులు కూడా పూర్తికాలేదని తెలుస్తోంది.

● ఆంధ్రజ్యోతి-
మిర్యాలగూడ, రామగిరి

మిర్యాలగూడలోని షాబూనగర్‌లో బెడ్ దశలోనే వాటర్ ట్యాంకు నిర్మాణం



ఉమ్మడి జిల్లా మునిసిపాటీలకు మంజూరైన అమృత్ పథకం నిధులు	
మిర్యాలగూడ	రూ.93.4కోట్లు
నల్లగొండ	రూ.56.75కోట్లు
చిట్యాల	రూ.12.5కోట్లు
నకిరేకల్	రూ.25కోట్లు
హాలియా	రూ.15.2కోట్లు
నందికొండ	రూ.44కోట్లు
చండూరు	రూ.9.8కోట్లు
సూర్యాపేట	రూ.45కోట్లు
కోదాడ	రూ.25.8కోట్లు
నేరేడుచర్ల	రూ.11కోట్లు
తిరుమలగిరి	రూ.30కోట్లు
చౌటుప్పల్	రూ.21కోట్లు
మోత్కూరు	రూ.12 కోట్లు
భువనగిరి	రూ.21.8 కోట్లు
యాదగిరిగుట్ట	రూ.38.64 కోట్లు
ఆలేరు	రూ.12కోట్లు
పోచంపల్లి	రూ.17.5కోట్లు
మొత్తం	రూ. 491.39

అమృత్--2 పథకం కింద ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పనులు చేపట్టేందుకు 2024 మార్చిలో కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ ఒప్పందం చేసుకుంది. 2026 మార్చి నాటికి పనులు పూర్తిచేసి నీటిసరఫరా చేసే విధంగా పనులు ప్రారంభించినప్పటికీ సుమారు 16 నెలల కాలం గడిచినప్పటికీ 30శాతం పనులు కూడా పూర్తికాలేదని అంటున్నారు. 74ఓవర్‌హెడ్ ట్యాంకులకు గాను 66 ట్యాంకుల నిర్మాణం ప్రారంభించి వివిధ స్థాయిల్లో నిర్మాణ పనులు కొనసాగుతుండగా మరో ఎనిమిది ట్యాంకులకు నిర్మాణ స్థలాలే ఖరారు కాలేదని తెలు స్తోంది. పైపులైన్లను 716 కిలో మీటర్లు వేయాల్సి ఉండగా కేవలం 140కిలోమీటర్లు వరకు మాత్రమే పూర్తిచేశారు. మిర్యాలగూడ మునిసిపాలిటీ పరిధిలో 49కిలోమీటర్ల డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ల ఏర్పా టుకు 12.5కిలో మీటర్లు మాత్రమే పూర్తిచేశారు.

మునిసిపాలిటీల విస్తరణ

మున్సిపాలిటీల విస్తరణతో వార్డుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. పరిసర గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం ద్వారా పట్టణ జనాభా పెరిగింది. 2013లో నందిపాడు గ్రామపంచాయితీ పరిధిలోని గ్రామా లు, వెంకటాద్రిపాలెం, హైదలాపురం పరిధిలోని ఇందిరమ్మ కాలనీతో కలుపుకుని మిర్యాలగూడ మున్సిపాలిటీని 28కి.మీ మేర విస్తీరణాన్ని పెంచారు. 2011జనాభా లెక్కల ప్రకారం మిర్యాలగూడ పట్టణ జనాభా 1,09,891మంది కాగా, విలీన గ్రామాలతో పాటు పెరిగిన జనాభా కలుపుకుని ప్రస్తుతం 1.37లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. గతంలో 36 వార్డులు ఉండగా వాటిని 48 వార్డులుగా పునర్విభజించారు. 1941లో థర్డ్‌గ్రేడ్ మున్సిపాలిటీగా ఏర్పాటైన నల్లగొండ మున్సిపాలిటీ ప్రస్తుతం ప్రథమశ్రేణికి చేరుకుంది. 32కిలో మీటర్లు విస్తరించిన మున్సిపాలిటీలో 2011 లెక్కల ప్రకారం 1,65,328 మంది జనాభా ఉండగా ప్రస్తుతం 2లక్షలకు పైగా జనాభా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

నల్లగొండలో కొనసాగుతున్న పనులు

నల్లగొండ మున్సిపాలిటీలో గత ఏడాది జూన్ మాసంలో పను లు ప్రారంభమయ్యాయి. మంచినీటి సరఫరా కోసం అన్నేశ్వరమ్మ గుట్ట, అక్కచల్మా, ఎస్ఎల్‌బిసి బత్తాయి మార్కెట్ సమీపంలో, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో, రామ్‌నగర్ పార్క్ సమీపంలో, వినా యక హౌసింగ్‌బోర్డ్ కాలనీ, రాక్‌హిల్స్ కాలనీ, రాఘవేంద్రకాలనీ, దత్తసాయికాలనీ, మధురనగర్‌కాలనీల్లో 10ట్యాంకులు నిర్మిస్తున్నా రు. వీటిలో అనేశ్వరమ్మ గుట్ట ప్రాంతంలో జరుగుతున్న వాటర్ ట్యాంకు దాదాపుగా పూర్తి కావొచ్చింది. మిగిలిన పనులు 60 పనులు పూర్తి కావచ్చాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు దాదాపు



60శాతం కావొచ్చాయి. రూ.216కోట్లతో ప్రారంభమవుతున్న యూజీ డీ పనుల్లో 185కిలోమీటర్ల పైపులైన్ ఏర్పాటుకు ఇప్పటి వరకు 100 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి మిగిలిన 85 కిలోమీటర్లు పూర్తి కావాల్సి ఉంది.

34 శాతం నిర్మాణ పనులు జరిగాయి



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అమృత్-2 కింద 34శాతం పనులు జరిగాయి. పలుచోట్ల ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి మున్సిపా లిటీల నుంచి స్థల స్వాధీనం చేయడంలో అధి కారులు జాప్యం చేశారు. మరికొన్ని చోట్ల ఇ ప్పటి వరకు స్థలం కేటాయించలేదు. పైపులైన్ల ఏర్పాటు, ట్యాంకుల నిర్మాణంలో జాప్యం జరిగినట్లు గుర్తించి సదరు కాంట్రాక్టర్‌కు లక్ష రూపాయల వరకు జరిమానా విధించాం.

● కె.వెంకటేశ్వర్లు, ఎస్ఈ, పబ్లిక్‌హెల్త్.



జనాభా పెరుగుదల ఆధారంగా..

మున్సిపాలిటీల్లో పెరుగుతున్న జనా భాకు అనుగు ణంగా నీటి సరఫరాకు అవసర మైన నిర్మాణ పనులను ప్రజా రోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. ప్రతి మనిషికి రోజూ 135లీటర్ల నీటిని అందించాలన్న జాతీయ విధానంతో మున్సిపాలిటీల్లో నీటి సరఫరాకు అమృత్-2 కింద చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీల్లో ఉన్న జనాభాను బట్టి ఏటా 2.5శాతం పెరుగుదల అంచనాతో మరో 30 ఏళ్ల వరకు పట్టణ ప్రజలకు నీటి కొరత లేకుండా రక్షిత మంచినీరు సరఫరా చేసే లక్ష్యంతో ప్రతిపాదనలు తయారు చేశారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో ప్రస్తుతం లక్షా 37 వేల జనాభాగా అంచనా వేసి మరో 30 ఏళ్లలో 2.50 లక్షలకు చేరుకుంటుందనే అంచనాతో పెద్దదేవులపల్లి రిజర్వాయర్ వద్ద గతంలో ఉన్న 10 ఎంఎల్‌డీ ట్యాంకుకు తోడు నూతనంగా 20 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన పంప్‌హౌస్ నిర్మాణం, వాటర్‌ట్యాంకు తండా వద్ద ఫిల్టర్‌బెడ్ ఏర్పాటుతో పాటు పైపులైన్‌ల నిర్మాణ ప్రక్రియ చేపట్టారు. ఈ నిధులతో 17మున్సిపాలిటీల్లో 74ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, సుమారు 716కిలో మీటర్ల గ్రావిటీ పైపులైన్‌లు ఏర్పాటు, 41,883 ఇళ్లకు నల్లాల బిగించాల్సిఉంది.

రోడ్డు ప్రమాదంలో సీపీఐ నేత మృతి


అయోధ్యచారి(ఫైల్)

సూర్యాపేట క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బొల్లోజు అయోధ్యచారి(52) మృతి చెందారు. ముందువెళుతున్న లారీ డ్రైవర్ సడన్‌బ్రేక్ వేయడంతో అయోధ్యచారి ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రికొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం రామానుజవరం గ్రామానికి చెందిన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బొల్లోజు అయోధ్యచారి(52) మంగళవారం తన గ్రామం నుంచి కారులో డ్రైవర్ సోలం రమేష్‌తో కలిసి హైదరాబాద్ బయలుదేరారు. సూర్యాపేటకు రాగానే రాత్రి కావడంతో పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో నివాసం ఉంటున్న బంధువుల ఇంటిలో బసచేశారు. బుధవారం తెల్లవారుజామున ఐదు గంటలకు సూర్యాపేట నుంచి కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని స్పీడ్ బ్రేకర్స్ వద్ద ముందు వెళుతున్న లారీ డ్రైవర్ బ్రేక్ వేశాడు. దీంతో అయోధ్యచారి ప్రయాణిస్తున్న డ్రైవర్ రమేష్ కారును అదుపు చేయలేక లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అయోధ్యచారి తలకు తీవ్రగాయాలుకాగా, చికిత్స పొందుతూ సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మృతిచెందారు. డ్రైవర్ రమేష్‌కు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నాడు. అయోధ్యచారి బంధువు వీరాచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం అయోధ్యచారి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చికిత్సపొందుతూ వ్యక్తి..

చింతపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వింజమూర్ గ్రామానికి చెందిన బినమోని మహేందర్ (34) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది జూలై 30వ తేదీన గడ్డి మందు తాగాడు. ఇరుగుపొరుగు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్సనిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మహేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడి.. గంజాయి స్వాధీనం

భువనగిరి టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని బ్రాహ్మణవాడలో ఓ ఇంటిపై ఆకస్మిక దాడులు చేసింది. ఉపాధి కోసం పశ్చిమ బెంగాల్ నుంచి భువనగిరికి వచ్చిన కాసిం షేక్ గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డారు. నిందితుడి వద్ద 70గ్రాముల గంజాయి, ఆరు గ్రాముల తెలియని పదార్థం, బ్యాటరీ ఆధారిత చిన్న తూకం యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. దాడుల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ రాధాకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, బృందం సభ్యులు నర్సిరెడ్డి, దుర్గయ్య, లింగస్వామి, నిహారిక, సురేష్ పాల్గొన్నారు.

నేడు అవార్డును అందుకోనున్న చేనేత కళాకారుడు


'మద్రాస్' ఇక్కత్ చీరను ప్రదర్శిస్తున్న చేనేత కళాకారుడు మంగళపల్లి శ్రీహరి

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేతలో ప్రతిభ కనబచ్చిన చేనేత కళాకారులను ప్రతి ఏటా కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుతో తెలంగాణ రాష్ట్ర చేనేత, జౌళి శాఖ సత్కరిస్తోంది. ఈ అవార్డుకు యాదాద్రి-భువనగిరి జిల్లాలోని భూదాన్ పోచంపల్లి పట్టణానికి చెందిన చేనేత కళాకారుడు మంగళపల్లి శ్రీహరి ఎంపికయ్యారు. ఈ నెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించే కార్యక్రమంలో చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఉంచి వారు రూ.25వేల నగదు పురస్కారంతోపాటు మెమెంటో, ప్రశంసా పత్రం అందుకోనున్నారు. శ్రీహరి వినూత్న డిజైన్లతో 'మద్రాస్' ఇక్కత్ చీరను రూపొందించారు. 234 కొయ్యలు, రిపీట్ లేకుండా ఆరు వరుసల్లో వైట్ బేస్ చీరలో ప్రకృతి అందాలతో పరవశించి నృత్యం చేస్తున్న అంబారి, నెమలిని రూపొందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దేవరకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం తాటికోలు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. దేవరకొండ సీఐ వెంకటొరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... తాటికోలు వాగు నుంచి జూలూరి అనిల్ ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక మాఫియా ఇష్టారాజ్యం

● కనగల్ వాగు బ్రిడ్జి కింద ఇసుక తవ్వకాలు ● వాగుకు వరదొస్తే బ్రిడ్జి కుంగి కూలిపోయే ప్రమాదం


వాగు బ్రిడ్జి వద్ద ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గోతులు

కనగల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇసుక తవ్వకాలతో కనగల్ వాగు బ్రిడ్జికి ముప్పు పొంచి ఉంది. బ్రిడ్జి పిల్లర్ల వద్ద యంత్రాల సాయంతో రాత్రిబవళ్లు ఇసుక తోడుతున్నారు. దీంతో బ్రిడ్జి కింద భారీ గోతులు ఏర్పడి బ్రిడ్జికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. దేవరకొండ-నల్లగొండ ప్రధాన రోడ్డుమార్గంలో ఈ బ్రిడ్జి కీలకంగా ఉండగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇసుక తవ్వకాలతో 2006-07 ప్రాంతంలో నిజాం కాలం నాటి పాత బ్రిడ్జి కుంగిపోయి కూలడంతో ఏళ్ల తరబడి రాకపోకలు నిలిచాయి. కొత్త బ్రిడ్జి నిర్మాణం జరిగే వరకు వాగు దారిలోనే ప్రయాణం చేస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత పరిమాణాలను అధికారులు దృష్టితో ఉంచుకోకుండా వాగు బ్రిడ్జి వద్ద ఇసుక తవ్వకాలను చూసీ చూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. కనగల్ వాగులో ఇసుక రీచ్‌కు అనుమతులు ఇచ్చిన మైనింగ్ అధికారులు బ్రిడ్జి వద్ద ఇసుక తవ్వకాలు జరగకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ ఆయా శాఖల మధ్య సమన్వయం లేదని, ఇసుక తవ్వకాలపై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. బ్రిడ్జికి అటు ఇటూ 500 మీటర్ల దూరంలో ఇసుక తవ్వకాలు చేపట్టాల్సి ఉండగా ఇవేమీ పట్టనట్లు ఇసుక వ్యాపారులు తవ్వకాలు చేస్తుండటంతో బ్రిడ్జికి ముప్పు వాటిల్లడమే కాక, భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయ బోర్లు వట్టిపోతున్నాయని కనగల్ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా బోయినపల్లి బ్రిడ్జికి ఇసుక అక్రమ తవ్వకాలతో ముప్పు పొంచి ఉందని గ్రామస్థులు వాపోతున్నారు.

బ్రిడ్జి సమీపంలో ఇసుక తవ్వితే కఠిన చర్యలు

కనగల్ వాగు బ్రిడ్జికి అటు ఇటు ఐదు వందల మీటర్ల దూరంలోనే ఇసుక తవ్వకాలు జరపాలి. బ్రిడ్జికి సమీపంలో ఇసుక తవ్వితే వాహనాలను సీజ్ చేసి కేసు లు నమోదు చేస్తాం. అనుమతి ఉన్న చోటే ఇసుక తవ్వకాలు జరపాలి. కనగల్ వాగు రీచ్‌ను ఇకనుంచి తరుచూ పర్యవేక్షిస్తాం.

● సామేల్ జాకబ్, నల్లగొండ జిల్లా మైనింగ్ ఏడీ

మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా

తుర్కపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం నాగాయపల్లి గ్రామంతో పాటు మదిర గ్రామమైన నాగాయపల్లితండాలో బెల్ట్‌షాపుల నిషేదంపై బుధవారం పంచాయతీ కార్యాలయంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామంలో మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా విధించాలని నిర్ణయించారు. గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తుండడంతో గ్రామస్థులు, యువకులు మద్యానికి బానిసై బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇక నుంచి గ్రామంలో మద్యం విక్రయించొద్దని బెల్ట్ పాపుల నిర్వాహకులను హెచ్చరించారు. గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నర్సింహరెడ్డి, మాజీ కోప్షన్ రహ్మత్ శరీఫ్, నాయకులు హటునాయక్, మాన్సింగ్ నాయక్, లోక్యా, నరేందర్, హర్యానాయక్, ధరావత్ రవి, హోహన్, కిషన్, రాములు, మంగ్యా ఉన్నారు.

42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి


ఢిల్లీలో చేపట్టిన నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కేంద్రం బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. రిజర్వేషన్లను అమలు చేసి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, పట్టణ అధ్యక్షులు కంకల కిష్టయ్య, బత్తిని సహదేవ్, లింగయ్య, సతీష్, మల్లేశం, బాలరాజు, భాస్కర్, పాల్గొన్నారు.

బీబీనగర్: ఢిల్లీలో బీసీ రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ రాష్ట్ర కాంగ్రెస్ చేపట్టిన ధర్నాకు బీబీనగర్ మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు తరలి వెళ్లారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి జంతర్ మంతర్ ధర్నాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు పంజాల రామాంజనేయులుగౌడ్, గోళి పింగల్‌రెడ్డి, గడ్డం బాలకృష్ణగౌడ్, గోళి నరేందర్‌రెడ్డి, గడ్డం బాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సిద్ధగురు రమణానంద మహర్షిపై అనుచిత వ్యాఖ్యలు

● యూట్యూబర్‌ను కోర్టులో హాజరుపెట్టిన పోలీసులు

భువనగిరి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సిద్ధగురు రమణానంద మహర్షిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూ ట్యూబర్‌ను పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపెట్టారు. భువనగిరి రూరల్ సీఐ ఎన్. చంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి శివారులోని శివశక్తి శిర్డీసాయి అనుగ్రహ పీఠం నిర్వాహకుడు సిద్ధగురు రమణానంద మహర్షిపై హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన ఫిలిమ్ జర్నలిస్టు దాసరి విజ్ఞాన్ యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో అనుచిత వ్యాఖ్యలు చేశారని భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయి. శివశక్తి శిర్డీసాయి అనుగ్రహ పీఠం జాయింట్ సెక్రటరీ వంకాయల బలరాం ఫిర్యాదు మేరకు యూట్యూబర్‌ను అదుపులోకి తీసుకుని భువనగిరి కోర్టులో హాజరు పెట్టినట్లు సీఐ తెలిపారు.

అభాగ్యుల ఆకలి తీరుస్తూ..

● తన హోటల్‌లో మిగిలిన ఆహార పదార్థాలతో ఆకలి తీరుస్తున్న శ్రీనివాస్ ● కూడళ్లు, బస్టాండ్లలో ఉన్న వారికి పదేళ్లుగా పంపిణీ

ఆయన హోటల్ యజమాని. ఆకలితో తన హోటల్‌కు వచ్చే ఎందరినో చూస్తుంటాడు. ఆకలి విలువ తెలిసిన ఆయన తన హోటల్‌లో రోజువారిగా మిగిలే ఆహార పదార్థాలను ఎందరో అభాగ్యులకు పంచుతూ ఆకలి తీరుస్తున్నాడు. పట్టణంలోని పలు కూడళ్లు, బస్టాండ్లలో రాత్రి సమయంలో ఉండే ఎందరికో ఆహారాన్ని అందించి మనవత్వం చాటుతున్నాడు పట్టణానికి చెందిన పానుగంటి శ్రీనివాస్.

● ఆంధ్రజ్యోతి, సూర్యాపేటటౌన్

సూర్యాపేట జిల్లాకేంద్రానికి చెందిన పానుగంటి శ్రీనివాస్ 2011లో భవాని మెస్ పేరుతో హోటల్‌ను ఏర్పాటు చేశారు. మొదట్లో హోటల్‌లో రాత్రి వరకు వినియోగదారుల కోసం వండిన వంటలు మిగిలిపోయేవి. దీంతో వాటిని పడేసేవారు. అన్నం వృథాగా పడవేయవద్దని, నలుగురి ఆకలి తీరిస్తే బాగుంటుందని అతడు ఆలోచించాడు. 2016 నుంచి వంట వండగా మిగిలిన అన్నం, కూరలు, సాంబారు వంటి ఆహార పదార్థాలను పక్కనే ఉన్న కొత్తబస్టాండ్‌లో అనాథలకు అందజేయడం ప్రారంభించాడు. ఆ తర్వాత పట్టణంలోని పలు ప్రాంతాల్లో రాత్రి సమయంలో రోడ్లపై ఉండే వారికి, అదేవిధంగా రాత్రి సమయంలో బస్సులు లేక బస్టాండ్‌లో ఉండేవారికి ఆహార ప్యాకెట్లు అందజేస్తున్నాడు. ప్రతిరోజూ 20ఉంచి 25వరకు ఆహార ప్యాకెట్‌లను పంపిణీ చేస్తూ అభాగ్యుల ఆకలి తీరుస్తున్నాడు శ్రీనివాస్. ఒక్కో సమయంలో ఎక్కువగా మొత్తంలో ఆహారం మిగిలితే కొత్త బస్టాండ్‌లో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్రిజ్‌లో ఉంచుతున్నాడు. ఎవరూ లేని అనాథలకు రాత్రి సమయంలో వారి వద్దకు వెళ్లి ఆహారాన్ని అందిస్తున్నాడు శ్రీనివాస్. సుమారు 10 సంవత్సరాల నుంచి ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తూ పండుగలు, వివాహాలు, ఇతర కార్యక్రమాల్లో మిగిలిన ఆహారాన్ని వృధా చేసే వారికి గొప్ప సందేశం ఇస్తున్నాడు.


బస్టాండ్‌లో ఉన్నవారికి ఆహార ప్యాకెట్ పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

సంతృప్తిగా ఉంటుంది



నేను సంపాదించిన డబ్బుతో ఎంతమందికి సహాయం చేస్తానో లేదో తెలియదు. కానీ ఆహారంతో నలుగురి ఆకలి తీర్చుతున్న తృప్తి గొప్పగా ఉంది. ఆహారాన్ని ఎవరూ వృధా చేయవద్దు. అవసరమైతే ఒక్కరి కడుపు నింపినా సంతృప్తిగా ఉంటుంది. ఇంట్లో జరిగే శుభకార్యాల్లో మిగిలిన ఆహారాన్ని అనాథలకు పంచి వారి ఆకలి తీర్చాలి.

● పానుగంటి శ్రీనివాస్, భవాని మెస్ హోటల్ నిర్వాహకుడు.

భౌతిక దాడులతో సమస్యలు పరిష్కారం కావు


మాట్లాడుతున్న నీలా సత్యనారాయణ

కోదాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భౌతిక దాడులతో సమస్యలు పరిష్కారం కావని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ అన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడలోని కిట్స్ కళాశాలలో బుధవారం విలేకరుల సమావేశం మాట్లాడారు. వారం క్రితం కారులో కుటుంబంతో హైదరాబాద్ నుంచి కోదాడకు వస్తుండగా, సూర్యాపేట వద్ద గుర్తు తెలియని దుండగులు తమపై దాడి చేశారని, తృటిలో తప్పించుకున్నట్లు పేర్కొన్నారు. రైస్‌మిల్లు, కళాశాల పరంగా ఆర్థిక లావాదేవీల్లో అభ్యంతరం ఉన్నవారు వచ్చి మాట్లాడుకోవచ్చన్నారు. అందుకు తాను ఎప్పుడైనా సిద్ధమేనని తెలిపారు. భౌతిక దాడులకు దిగటం ఏమిటని ప్రశ్నించారు. దాడులు పిరికిపంద చర్య అని, వాటికి భయపడే ప్రసక్తే లేదన్నారు.

చేనేతకు చేయూత

● కాంగ్రెస్ హయాంలో పలు పథకాలకు కొత్త రూపు

● అధికారులు సమన్వయంతో పనిచేస్తే నేతన్నలకు లబ్ధి



గత పాలకుల నిర్లక్ష్యంతో సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ పథకాల్లో వైఫల్యాల దృష్ట్యా వాటిని కొన్ని మార్పులు, చేర్పులు చేసి చేనేత కార్మికులను పరిరక్షించే చర్యలు చేపట్టింది.

- నల్లగొండ, మోత్కూరు, భూదాన్‌పోచంపల్లి

దేశానికి అన్నం పెట్టే రైతన్న ఎంత ముఖ్యమో, వస్త్రాన్ని అందించే నేతన్న కూడా అంతే ముఖ్యం. మానవాళికి వస్త్రాన్ని అందించిన నేతన్న బతుకు నేడు దుర్భరంగా మారింది. ప్రభుత్వాలు పట్టించుకోకున్నా .. వారసత్వ వృత్తిని, కళను కాపాడుకునేందుకు చేనేత కార్మికులు ఎంతో శ్రమిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం పాత పథకాలకు కొద్దిగా మార్పు చేసి అమలు చేస్తోంది. చేనేత వస్త్రాలను మగ్గాలపై నేసే కళాకారులు యాదాద్రి-భువనగిరి జిల్లాలోనే అధిక సంఖ్యలో ఉన్నారు. ఇక్కడి చేనేత కళాకారులు రూపొందించిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై పట్టు చీర, పుట్టపాక తేలియా రుమాల్ జాతీయ స్థాయిలో భౌగోళిక గుర్తింపును పొందాయి. జిల్లాలో ఇక్కత్ డిజైన్లతో నేసే వివిధ రకాల వస్త్రాలకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉంది. అయితే మగ్గం నేసే కార్మికులను గుర్తించి జియోట్యాగింగ్ చేసి ప్రత్యేకమైన నంబరును చేనేత, జౌళి శాఖ ద్వారా కేటాయించారు. చేనేత సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం 'చేనేత అభయహస్తం' పేరుతో అమలు చేస్తోంది

చేనేత సంక్షేమ పథకాలు ఇవే..

రాష్ట్ర ప్రభుత్వం చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలులోకి తీసుకవచ్చింది. నల్లగొండ జిల్లాలో చేనేత రంగానికి సంబంధించి 2,700 జియోట్యాగ్‌లు ఉండగా పవర్‌లూమ్‌లకు 4,223 జియోట్యాగ్‌లు ఉన్నాయి. తెలంగాణ నేతన్న పొదుపు పథకం కింద చేనేత కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడం కోసం తెలంగాణ చేనేత పొదుపు పథకం ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి పునఃప్రారంభించారు. ఇందుకు ఈ పథకంలో 4,125 మంది కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. దీంతో పాటు తెలంగాణ మరమగ్గాల పథకాన్ని 2022 జూన్‌లోనే పునఃప్రారంభించారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ వాటా కింద 3032మంది మరమగ్గ కార్మికులకు రూ.11.19కోట్లను సంబంధిత కార్మికుల ఖాతాలో జమ చేస్తూ వస్తున్నారు.

ఇకపోతే నేతన్న బీమా పథకాన్ని 2022 ఆగస్టు 7వ తేదీన ప్రారంభించారు. ఈ పథకం కింద 5,678 చేనేత, మరమగ్గ కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. 40మంది కార్మికులు వివిధ కారణాలతో మరణించగా ప్రభుత్వం ఈ పథకం కింద ఆ కార్మికుల కుటుంబాల నామినీల ఖాతాల్లో రూ.2కోట్లను జమ చేశారు. 2024 ఆగస్టు 14 నుంచి ప్రభుత్వం గరిష్ఠ వయోపరిమితిని తొలగించింది.

చేనేత రుణమాఫీ పథకంతో..

జిల్లాలో 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు తీసుకున్న చేనేత రుణాలను మాఫీ చేశారు. 27 బ్యాంకుల ద్వారా 515 చేనేత కార్మికులకు రూ. 3.79 కోట్లు ప్రభుత్వం మాఫీ చేసింది. చేనేత క్లస్టర్ల పథకం కింద మునుగోడు నియోజకవర్గంలోని చండూరు మండలంలో చండూరు బ్లాక్ లెవల్ క్లస్టర్ కింద 219మంది చేనేత కార్మికుల కోసం 2021-22 సంవత్సరంలో రూ.110.08 లక్షలతో లెవల్ క్లస్టర్ జారీని చేశారు. మొదటి విడత కింద రూ.25 లక్షలకు పైగా నిధులను విడుదల చేశారు. హెచ్ఎస్ఎస్ కింద లబ్ధిదారులను ఎంపిక చేసి పనిముట్లను సరఫరా చేస్తున్నారు. నార్కట్‌పల్లి మండలంలో బ్లాక్ లెవల్ క్లస్టర్ కింద 152 మంది చేనేత కార్మికులకు 2022-23 సంవత్సరంలో రూ.115 లక్షలకు పైగా నిధులను క్లస్టర్ జారీ చేశారు. మొదటి విడతగా రూ.43లక్షలకు పైగా విడుదల చేయగా హెచ్ఎస్ఎస్ కింద లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. ఇదిలా ఉంటే మునుగోడు మండలంలోని బ్లాక్ లెవల్ క్లస్టర్ కింద 212 మంది చేనేత కార్మికుల కోసం 2023-24 సంవత్సరంలో రూ.154.12లక్షలతో బ్లాక్ లెవల్ క్లస్టర్ జారీ చేశారు. మొదటి విడత కింద రూ.58.81లక్షల నిధులను విడుదల చేశారు.

హ్యాండ్లూమ్ మార్క్ లేబుల్ ప్రత్యేకత

చేనేతల కోసం తయారు చేసిన తెలంగాణ హ్యాండ్లూమ్ మార్క్ లేబుల్లో చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ముఖ్యంగా లేబుల్ ఒకవైపు తెలంగాణ హ్యాండ్లూమ్ మార్క్‌తోపాటు 9 అంకెల నంబరు ఉంటుంది. అందులో .. మొదటి రెండు అంకెలు ఆ జిల్లా /అసిస్టెంట్ డైరెక్టర్ కోడ్‌కు సంకేతాలు కాగా.. తర్వాత రెండు అంకెలు ఆ ఉత్పత్తి ఏడాదిని రివర్స్‌తో సూచిస్తుంటాయి. తర్వాత అయిదు అంకెలు రన్నింగ్ సీరియల్ నంబరు తెలియజేస్తాయని అధికారులు వెల్లడిస్తున్నారు. లేబుల్ మరోవైపు కార్మికుడు, ఉత్పత్తి వివరాలు ఉంటాయని తెలిపారు. ఇలా సమగ్ర విధానాల ద్వారా చేనేత కార్మికుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తుంది.

ఎదుర్కొంటున్న సవాళ్లు..

చేనేత కార్మికులు నేసిన వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. టెస్కో కొనుగోలు చేయకపోవడంతో ప్రస్తుతం జిల్లాలో కోట్లాది రూపాయల వస్త్ర నిల్వలు చేనేత సహకార సంఘాల్లో పేరుకుపోయాయి. కొందరు వ్యాపారులు పవర్‌లూమ్‌లపై ప్రింటెడ్ చీరలు తయారు చేసి చేనేత వస్త్రాలకు మార్కెట్లో విక్రయిస్తున్నారు. మార్కెట్లో అతి తక్కువ ధరకే లభిస్తుండడంతో కొనుగోలు దారు లు ఆ చీరలకే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చేనేత కార్మికులు ఆదుకోవాలని చేనేత సహకార సంఘాల నాయకులు కోరుతున్నారు.

అంతర్జాతీయ స్థాయి అవార్డు సొంతం

చౌటుప్పల్ : సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో ఇక్కడ కార్మికులు తయారు చేసే పట్టు చీరలకు రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు వరించాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రకటించే చేనేత జాతీయ పురస్కారాలకు ఈ గ్రామ చేనేత కార్మికులు లేకుండా అవార్డు జాబితా ఉండదంటే అతిశయోక్తి కాదు. పుట్టపాక గ్రామం చేనేతకు ప్రసిద్ధి. ఇక్కత్ చీరల తయారీకి ఈ గ్రామం కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఈ చీరల తయారీతో ఈ గ్రామం జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. గ్రామంలో నూటికి 70 మంది ప్రజలు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. వారసత్వంగా వస్తున్న హస్తకలను బావి తరాలకు అందిస్తూ ప్రపం చం చూపును తమ వైపుకు తిప్పుకుంటున్నారు.


నిత్య నూతనంగా..

పుట్టపాక గ్రామానికి చెందిన చేనేత కార్మికులు అందరిలాగా కాకుండా నిత్యం నూతనంగా ఆలోచిస్తుంటారు. మార్కెట్లో ప్రజల అభిరుచులకు అనుగుణంగా అందమైన వస్త్రాలను తయారు చేస్తుంటారు. ఈ గ్రామ కళాకారులు ప్రత్యేకంగా తేలియా రుమాలు వస్త్రాలను తయారు చేస్తుంటారు. ఇక్కత్ విధానంలో తెలియా రుమాల్, డబ్బులు ఇక్కత్ చీరల తయారీలో ప్రావీణ్యం కనబరుస్తూ రోజు రోజుకు కొత్త కొత్త డిజైన్లను ఆవిష్కరిస్తున్నారు. చీరల తయారీలో రంగు రసాయనాల జోలికి వెళ్లకుండా సహజ సిద్ధమైన రంగులతో పట్టు వస్త్రాలను రూపొందిస్తున్నారు. ఈ వస్త్రాలు వేసవిలో చల్లగా, చలికాలంలో వెచ్చగా ఉండడం వీటి ప్రత్యేకత. అందుకే పుట్టపాకలో పట్టుచీరలకు ప్రత్యేక స్థానం లభిస్తుంది. ఇక్కడ తయారయ్యే చీరలకు మార్కెట్‌లో మంచి ఆదరణ లభిస్తుంది.

అవార్డులకు నిలయం

చేనేత రంగంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం అవార్డులను ప్రకటిస్తుంటాయి. రాష్ట్రస్థాయిలో ఇప్పటికే పదుల సంఖ్యలో ఇక్కడి కార్మికులు అవార్డులను అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించే పద్మశ్రీ అవార్డులను సైతం ఈ గ్రామానికి చెందిన చేనేత కార్మికులు గజం గోవర్ధన్, గజం అంజయ్యలు అందుకున్నారు. అదే విధంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఇదే గ్రామానికి చెందిన చేనేత కార్మికులు గూడ పవన్, గజం నర్మదలను జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక చేసింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఇదే గ్రామానికి చెందిన చేనేత కార్మికులు సామల భాస్కర్, గూడ పవన్, కొలను శంకర్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులను ప్రకటించింది. అంతే కాకుండా గ్రామానికి చెందిన సుమారు 20 మంది చేనేత కార్మికులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులను అందుకున్నారు. ఇక్కడి కార్మికులు తయారు చేసిన వివిధ రకాల వస్త్రాలను దేశ విదేశాలలో జరిగే ఎగ్జిబిషన్లను సైతం ప్రదర్శిస్తుంటారు. గతంలో పుట్టపాక చేనేత కార్మికులు అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీరలు తయారు చేసిన ఘనత వీరి సొంతం.

రంగుల అద్దకం కేంద్రం ఏర్పాటు చేయాలి



మోత్కూరు ఇక్కత్ హ్యాండ్లూమ్ క్లస్టర్‌కు అనుబంధంగా రంగుల అద్దకం కేంద్రం ఏర్పాటు చేయాలని చాలా కాలంగా కోరుతున్నాం. పలుమార్లు ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చాం. ఇక్కత్ హ్యాండ్లూమ్ కేంద్రంలో పని చేస్తున్న కార్మికులు మాస్టర్ వీవర్స్ వద్ద నూలు తెచ్చుకుని చీరెలు నేయడం వల్ల కార్మికులకు ఎక్కువగా గిట్టుబాటు కావడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రంగుల అద్దకం కేంద్రం ఏర్పాటు చేయాలి

పాశికంటి లక్ష్మీనర్సయ్య, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు, మోత్కూరు

ఇక్కత్ హ్యాండ్లూమ్ క్లస్టర్‌తో ఉపాధి

మోత్కూరు మునిసిపల్ కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన స్ఫూర్తి భవన్ (ఇక్కత్ హ్యాండ్లూమ్ క్లస్టర్‌లో సుమారు 30 మంది చేనేత కార్మికులు మొగ్గం నేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఏడేళ్ల క్రితం స్థానిక చేనేత నాయకుల అభ్యర్థన మేరకు అప్పటి ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ కేంద్ర ప్రభుత్వం నుంచి మోత్కూరులో ఇక్కత్ హ్యాండ్లూమ్ క్లస్టర్ భవన నిర్మాణం, అందులో మగ్గాల ఏర్పాటు రూ.1.73 కోట్ల నిధులు మంజూరు చేయించారు. అందుకు స్థానిక చేనేత సహకారం సంఘం ఆధ్వర్యం లో సుమారు రూ.29 లక్షలు తమ వంతు వాటాకు చెల్లించారు. దాని నిర్మాణం పూర్తయి, ప్రారంభించాక చేనేత కార్మికులకు శిక్షణ ఇచ్చారు. అందులో 30 మగ్గాలు ఏర్పాటు చేయగా 30 మంది చేనేత కార్మికులు మగ్గాలు నేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇంటి వద్ద నేసినప్పుడు 3,4 రోజులకు ఒక చీర నేసేవారు. అక్కడ మగ్గం నేయడం వల్ల కార్మికుల్లో పోటీతత్వం పెరిగి రెండు రోజులకో చీర నేస్తున్నారు.

చేనేతలకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం కృషి




చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం చేనేత అభయ హస్తం పథకం అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా యాదాద్రి-భువనగిరి జిల్లాలో సుమారు 11,389 మంది కార్మికులు అర్హులుగా గుర్తించాం. జియో ట్యాగింగ్ లేని మగ్గం కార్మికులు కొత్తగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉం ది. చేనేత అభయ హస్తం పథకం కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. - బి.పద్మ, చేనేత, జౌళిశాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్

చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి

ప్రభుత్వ ఆదేశాల మేరకు చేనేత కార్మికుల సంక్షేమ అభివృద్ధి కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. చేనేతతో పాటు పవర్‌లూమ్‌లకు జియోట్యాగ్ చేశాం. కార్మికుల సంక్షేమం కోసం పొదుపు, బీమా పథకాలను అమలు చేస్తున్నాం. 2017 నుంచి 2024 వరకు తీసుకున్న చేనేత రుణాలను మాఫీ చేశాం. క్లస్టర్ల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కార్మికుల వద్దకు తీసుకపోవడం కోసం ప్రణాళికా బద్ధంగా పనిచేస్తున్నాం.

- ద్వారక్, చేనేత జౌళిశాఖ ఏడీ, నల్లగొండ

చేనేత రంగాన్ని ఆదుకోవాలి



చేనేతరంగంలో సమస్యలు కళ్ల ముందు కనిపిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చేనేత సమస్యలు పరిష్కరించాలని ఇటీవల చేనేత మంత్రి, కమిషనర్‌లకు వినతిపత్రాలను అందజేశాం. వ్యవసాయం మాదిరిగానే చేనేతరంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నాం. ప్రకటించిన పథకాలు అమలు జరిగేలా చూడాలి.

- కూరపాటి రమేష్, రాష్ట్ర చేనేత నాయకుడు

మూసీ క్రస్టుగేట్ల మూసివేత

కేతేపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మూసీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో బుధవారం ఉదయం నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు 8వ నెంబరు క్రస్టు గేటును మూసివేయడంతో పాటు 3వ నెంబరు గేటును ఒక అడుగుకు తగ్గించి దాదాపు 600 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తూ వచ్చారు. బుధవారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 620 క్యూసెక్కులు మాత్రమే నమోదవడంతో సాయంత్రం 7గంటల ప్రాంతంలో 3వ నెంబరు క్రస్టుగేటును సైతం పూర్తిగా మూసివేశారు. ఎగువ నుంచి వచ్చే వరద నీటిలో 400 క్యూసెక్కుల పైచిలుకు నీటిని ప్రాజెక్టు కుడి, ఎడమకాల్వల ద్వారా ఆయకట్టుకు విడుదల చేస్తూ మిగిలిన నీటితో అధికారులు క్రమంగా ప్రాజెక్టును 645అడుగుల గరిష్ఠ నిల్వ స్థాయికి చేర్చే యత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎగువ నుంచి 620.42 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా ప్రాజెక్టు నీటిమట్టం 643 అడుగులు(3.94టీఎంసీలు)గా ఉంది.

587.90 అడుగుల వద్ద సాగర్ నీటిమట్టం

నాగార్జునసాగర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 587.90 అడుగులుగా ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు(312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 587.90 అడుగులు (306.0414 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 5,088 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 8,541క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,379 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 44,108 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 66,131 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

శారదాదేవిగా ఎల్లమ్మ తల్లి

● ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కనగల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని బుధవారం అమ్మవారు శారదాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ముఖ్యఅర్చకుడు మల్లాచారి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహామంగళ హారతులిచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారి సన్నిధిలో పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కాగా, వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు నిర్వహించి చీరసారె, ఒడి బియ్యం సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఈవో నాగిరెడ్డి పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

● సమగ్ర శిక్ష అభియాన్ ఏఎస్పీడీ రాధారెడ్డి

కట్టంగూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సమగ్ర శిక్ష అభియాన్ ఏఎస్పీడీ రాధారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం కట్టంగూరు కేజీబీవీ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో విద్యాబోధన సక్రమంగా జరుగుతుందా? నాణ్యమైన భోజనం అందిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాల, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. పాఠశాలలో వండుతున్న వంటలను పరిశీలించారు. అదనపు తరగతి గదులను పరిశీలించి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట నల్లగొండ జీసీడీవో అరుంధతి, డీఈవో భిక్షపతి, ఎంఈవో అంజయ్య, కేజీబీవీ ఎస్‌వో నీలాంబరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతన వెతలు



● అవుట్ సోర్సింగ్ సిబ్బందికి అందని జీతాలు

● వేతనాల కోసం ఆసుపత్రి వర్కర్ల ఇబ్బందులు

● వెంటనే విడుదల చేయాలని వేడుకోలు

భానుపురి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో పని చేసే అవుట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు లేక విలవిలలాడుతున్నారు. నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో కుటుంబాన్ని పోషించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల కంటే అవుట్‌సోర్సింగ్ సిబ్బందే సకాలంలో విధులకు హాజరవుతున్నారు. వీరి సేవలు రోగులకు పూర్తి స్థాయిలో అందుతున్నాయి. ఆసుపత్రి, కళాశాలలో కీలకంగా వ్యవహరిస్తున్న సిబ్బందికి ఏజెన్సీలకు రెన్యూవల్ కాకపోవడమా, లేక నిధుల కేటాయింపు లేకపోవడం వల్లనో తెలియదు కానీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. ఏజెన్సీలను ఎవరికి కేటాయించాలని ప్రజాప్రతినిధులు తర్జనభర్జనలో ఉన్నట్లు సమాచారం. కొత్త ఏజెన్సీ నిర్వాహకులకు ఏజెన్సీలను కేటాయించే వరకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేనట్లు తెలుస్తోంది. ఏజెన్సీల కేటాయింపుపై పెద్దపెద్ద నాయకులు కలెక్టర్‌కు ఒత్తిడి తీసుకువస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు పంపించలేకపోతున్నట్లు సమాచారం. కొత్త ఏజెన్సీ నిర్వాహకులు వస్తేనే జీతాలు రానున్నాయి. అప్పటి వరకు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది కుటుంబాలను నెట్టుకు రావాల్సిందే. నాలుగు నెలల నుంచి జీతాలు లేక కుటుంబాన్ని సాకలేకపోతున్నామని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో ఉన్న ఏజెన్సీలకు రెన్యూవల్ ఇస్తున్నారా? లేక కొత్త ఏజెన్సీలను నియమాకం చేస్తున్నారా? అనే డైలమాలో పడ్డారు. కలెక్టర్ ద్వారా ప్రభుత్వం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు త్వరగా విడుదల చేయాలని అధికారులను వేడుకుంటున్నారు.

అవస్థలు పడుతున్న 118 మంది సిబ్బంది

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో 48 మంది ల్యాబ్, ఫార్మసీలలో పని చేస్తున్నారు. సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 70మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్స్‌గా, ల్యాబ్ అటెండర్లుగా, ఎక్స్‌రే, ఈసీజీ, స్కానింగ్, సీటీ స్కానింగ్, డీఈవోలుగా, డీవోలుగా, స్టోర్ కీపర్లుగా, అకౌంట్ క్లర్క్‌లుగా, వివిధ హోదాల్లో రోగులకు సేవలందించడం జరుగుతోంది. వీరు లేకపోతే ఆస్పత్రిలో రోగులకు సేవలు స్తంభించే పరిస్థితి ఉంది. అయితే వీరికి జీతాలు రాక నాలుగు నెలలు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అధికారులు మాత్రం జీతాలు ఇవ్వాలని కలెక్టర్‌కు లెటర్ ఇచ్చామని చెబుతున్నారు. రేపు, మాపు జీతాలు వస్తాయని వంకలూ చెబుతూ కాలం వెల్లదీస్తున్నారని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ ఉద్యోగులకు నెలనెలా జీతం నుంచి జీఎస్టీ, 4 శాతం ఏజెన్సీ కమీషన్, 1 శాతం ఈఎస్ఐ కట్ చేస్తున్నారు. ఇటీవల కాలం నుంచి ఈఎస్ఐ సైతం ల్యాప్స్ అయ్యిందని ఆందోళన చెందుతున్నారు. రూ.31 వేలు జీతం ఉన్న ఉద్యోగులకు 4900 జీఎస్టీ కట్ చేస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఇకపోతే రూ.21 వేలు జీతం ఉన్న వారికి కటింగ్‌లు పోను 16 వేలు మాత్రం చేతికి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీతాలు ఇవ్వాలని వేడుకుంటున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. కొత్త కాంట్రాక్టర్ వచ్చిన తర్వాతే జీతాలు ఇస్తామని చెప్పారు. నాలుగు నెలల నుంచి జీతాలు రావడం లేదని అవుట్‌సోర్సింగ్ సిబ్బంది చెబుతున్నారు.

- శ్రవణ్‌కుమార్, సూపరింటెండెంట్, సూర్యాపేట ఏరియా ఆసుపత్రి

యాదగిరి క్షేత్రంలో పవిత్రోత్సవాలు పరిసమాప్తం

● నేటినుంచి యథావిధిగా నిత్యకైంకర్యాలు

యాదగిరిగుట్ట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట, పాతగుట్ట లక్ష్మీనరసింహుల ఆలయాల్లో మూడు రోజులుగా కొనసాగిన పవిత్రోత్సవాలు బుధవారంతో పరిసమాప్తమయ్యాయి. ప్రధానాలయంలో ఉత్సవమూర్తులను బంగారు ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక సేవలో తీర్చిదిద్దారు. దివ్య స్వర్ణ విమానగోపురంపై ఉన్న సుదర్శన చక్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు పవిత్రమాలలతో అలంకరించారు. వేదమంత్రాలతో పవిత్రీకరించి సప్తవర్ణాల పట్టుపోగులతో తయారు చేసిన పవిత్రమాలలను స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు వేద మంత్రాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ అలంకరణతో వేడుకలు ముగిశాయని ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు తెలిపారు. పాతగుట్ట ఆలయంలోనూ పవిత్రోత్సవాల ముగింపు వేడుకలు వైభవంగా సాగాయి. వేడుకల్లో ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు దంపతులు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, డీఈవో భాస్కరశర్మ, ఏఈవో జూశెట్టి కృష్ణ పాల్గొన్నారు. కాగా యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం రద్దు చేసినవి మినహా నిత్య పూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 13,72,271 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

● ప్రతీ సంవత్సరం ఆలయంలో నిర్వహించే పవిత్రోత్సవాల సందర్భంగా ఈ నెల 4,5,6 తేదీల్లో నిత్యపూజా కైంకర్యాలు రద్దు చేశారు. వేడుకలు బుధవారం ముగిసినందున గురువారం నుంచి ఆస్థాన, ఆర్జిత పూజలను పునఃప్రారంభిస్తున్నట్లు ఈవో తెలిపారు.



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ఆలయ భద్రతకు నిఘా నేత్రాలు : ఏసీపీ

యాదగిరిగుట్ట ఆలయ భద్రతకు నిఘా నేత్రాలు ఎల్లప్పుడు పని చేసేందుకు తగిన చర్యలు చేపట్టనున్నట్లు యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. యాదగిరిగుట్ట ఆలయంలో బుధవారం నిఘా నేత్రాల పరితీరును పరిశీలించి పోలీసులకు తగిన సూచనలు చేసి మాట్లాడారు. ఆయన వెంట పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్, ఎస్పీఎఫ్ ఏఎస్ఐ నాగేశ్వరరావు, అనిల్ ఉన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా శేఖర్



శేఖర్

కట్టంగూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరు లయన్స్ క్లబ్ నూతన కమిటీని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు, జిల్లా గ్యాట్ లీడర్ ఎర్ర శంభులింగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన చిక్కు శేఖర్, కార్యదర్శిగా కట్టంగూరుకు చెందిన గుడిపాటి శివప్రసాద్, ట్రెజరర్‌గా రాములు, ఉపాధ్యక్షులుగా రెడ్డిపల్లి సాగర్, కల్లూరి వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీగా బసవోజు వి నోద్‌కుమార్, జీఎస్టీగా ఆకవరపు బ్రహ్మాచారి, జీఎంటీగా అక్కినేని నవీన్, జీఈటీగా తవిడబోయిన నర్సింహ, ఎల్‌సీఐఎఫ్‌గా వెంకటాచారి, ప్రచారకర్తగా చెరుకు శ్రీనివాస్, గౌరవ సలహాదారుడిగా ఫున్న సుందరయ్యలను ఎన్నుకున్నారు.

'రాజగోపాల్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యం'

మర్రిగూడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రామదాస్ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని అన్నారు. రాజగోపాల్‌రెడ్డి రాజీనామా పుణ్యమే ఉప ఎన్నిక రావడం వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి నోచుకుందన్నారు. ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచి ఏ పదవులను ఆశించకుండా నియోజక వర్గ అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి, బడుగు బలహీన వర్గాల అభ్యునతికి ప్రాధాన్యత ఇస్తూ ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తున్నారని వారన్నారు. ఈ సమావేశంలో రాపోలు యాదగిరి, మల్లేష్, రవీందర్‌రావు, లక్ష్మీప్రసన్న, రవి, గ్యార వెంకట్, వెంకటంపేట బాలయ్య, అజిత్‌రెడ్డి ఉన్నారు.

యాంత్రీకరణను సద్వినియోగం చేసుకోవాలి

చండూరు రూరల్, మునుగోడు ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యాంత్రీ కరణ పథకాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో చంద్రిక అన్నారు. బుధవారం చండూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2025-26 సంవత్సరానికి వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా రాయితీపై వ్యవసాయ పరికరాలకు బడ్జెట్ కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఆయా గ్రామాల్లో సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదించి దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఎవరైనా ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల కోసం మండలంలోని రైతుల నుంచి దరఖాస్తులను ఈ నెల ఐదో తేదీ నుంచి 15వ తేదీ రకు స్వీకరిస్తున్నామని మునుగోడు మండల వ్యవసాయ అధికారి ఎస్.పద్మజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బియ్యం అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్ట్ కేసు

మర్రిగూడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేస్తామని జిల్లా పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ హెచ్చరించారు. బుధవారం మర్రిగూడ మండలంతో ఆయన మాట్లాడారు.

బీసీ రిజర్వేషన్లను ఆమోదించాలి

శాలిగౌరారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్ల ఆమోదానికి మద్దతుగా చేస్తున్న ధర్నాలో నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.వెంటనే కేంద్ర ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్లను అమోదించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదారం మాజీ ఎంపీటీసీ నోముల జనార్దన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడాల రమేష్, సింగల్ విండో డైరెక్టర్ నోముల రవికుమార్, భూపతి వెంకన్న, పుల్లూరి దేవేందర్, మంగదుడ్ల శ్రీనివాస్, నిమ్మల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా లయన్స్ క్లబ్ స్థాపనోత్సవం

మునుగోడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మునుగోడులో కొత్తగా ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ స్థాపనోత్సవాన్ని నిర్వాహకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం క్లబ్ నూతన కమిటీ కార్యవర్గాన్ని ప్రకటించారు. క్లబ్ సభ్యులందరికీ జ్ఞాపికను అందజేశారు. నూతన అధ్యక్షుడిగా లయన్ నారబోయిన రవి ముదిరాజ్, కార్యదర్శిగా లయన్ పాలకూరి నరసింహగౌడ్, కోశాధికారిగా లయన్ మిర్యాల వెంకటేశంతో పాటు పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

రాష్ట్ర సాధనకు ఎనలేని కృషి చేసిన జయశంకర్



జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ రమేష్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఎనలేని కృషి చేశారని ప లువురు అధికారులు, నాయకులు అన్నారు. బుధవారం జయశంకర్ సార్ జయంతిని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలంగాణ కోసం జయశంకర్ చేసిన త్యాగాలు మరువలేనివని గుర్తు చేశారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని యువత హక్కుల సాధన కోసం పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆవశ్యకతను ప్రజలందరికీ చాటి చెప్పిన మహానుభావుడని కొనియాడారు.

● నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్ పాల్గొన్నారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీఆర్‌డీ డీ ఎస్పీ రవి, ఏఆర్ఎస్ఐ చిన్నబాబు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జయశంకర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు సమర్పించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, చీర పంకజ్‌యాదవ్, శ్రీనివాస్, కరీంపాషా, గణేష్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, రవీందర్‌రావు, రాం మోహన్‌రావు, గోవర్ధన్‌యాదవ్ పాల్గొన్నారు.

● మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో యూనివర్సిటీ ఉపకులపతి ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి, అంజిరెడ్డి, రవి, రేఖ, రూప, వెంకటరమణారెడ్డి, లక్ష్మీప్రభ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎన్‌జీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పరంగి రవికుమార్, నర్సింగ్ కోటయ్య, వెంకట్‌రెడ్డి, మల్లేశం, శివరాణి, సావిత్రి పాల్గొన్నారు.

● సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయి న కేశవులుముదిరాజ్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో చిత్రం నరేష్, డాక్టర్ ఎఎ ఖాన్, యాదగిరి గౌడ్, నిరంజన్, అశోక్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

● కేతేపల్లి మండలంలోని భీమారం జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ని వాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.భిక్షమయ్య, టీచర్లు రాపోలు పరమేష్, బి.జానకిరెడ్డి, జి.రమేష్, జి.వెంకటేశ్వర్లు, కె.శివయ్య, ఎల్.శ్రీధర్, శేఖర్ పాల్గొన్నారు.

● కట్టంగూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ కుమార్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ప్రియదర్శిని, జూనియర్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మీ, ఊర్మిళ, సిబ్బంది సంతోష, రవి, రాము, అరవింద్, వీఆర్‌ఏలు రాజు, మల్లికార్జున్, సైదమ్మ, లతీఫ్ పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని వనిపాకల జడ్పీహెచ్‌ఎస్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం బాణాల శ్రీనయ్య, టీచర్లు దంతూరి సైదులుగౌడ్, గంపల రవీందర్‌రెడ్డి, నర్సింహాచారి, కవిత, నజీరున్నీసా బేగం, విజయ, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో సుమలత, ఎంఈవో పద్మ, డీటీ పార్వతమ్మ, సీనియర్ అసిస్టెంట్ రాములు, గోవర్ధన్‌బాయి, ఆర్ఐ సునీత, రాంబాబు, ఏపీవో సుధాకర్ పాల్గొన్నారు.

● శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతిలక్ష్మి ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో జంగమ్మ, కార్యాలయ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

● మర్రిగూడలో ఎంపీడీవో మున్నయ్య మాట్లాడుతూ తెలంగాణ ఆవశ్యకతను ప్రజలందరికీ చాటి చెప్పిన మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంతో పాటు దామర భీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం లచ్చిరాంనాయక్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్యాలయం, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణ షురూ

(5వ పేజీ తరువాయి)

తరుణంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయడమే మంచిదని ప్రభుత్వం భావించి పలు పరికరాలను సబ్సిడీపై అందించనుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంలో కేంద్ర భాగస్వామ్యం కూడా ఉండగా, ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

రైతులు కోరిన కంపెనీ పరికరం మంజూరు

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులు కోరిన కంపెనీకి సంబంధించిన పరికరమే అందజేస్తారు. రైతుల నుంచి డీడీలు తీసుకొని రాయితీ ద్వారా ఆయా కంపెనీల నుంచి పరికరాలు తెప్పించి అందించనున్నారు. ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఉమ్మడి రాష్ట్రం నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకం కొనసాగుతుండగా, ఆరేళ్లుగా ఈ పథకం నిలిచింది. దీంతో రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించే అవకాశాలు లేకుండా పోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గత ఏడాది యాసంగి నుంచే రైతులకు రాయితీపై యంత్రాలను అందజేయాలని నిర్ణయించింది. రైతులకు అవసరమైన ఉపకరణాలు, యంత్రాలను రాయితీపై సరఫరా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయడమే గాక జిల్లాల వారీగా రైతుల నుంచి ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోనుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల వ్యవసాయ అధికారుల నుంచి నివేదికలు తీసుకుంది. రైతులకు అందజేయాల్సిన పనిముట్లు, మొత్తం 15 రకాల యంత్ర పరికరాల జాబితాను వ్యవసాయశాఖ అధికారులు రూపొందించారు. అందులో రోటర్‌వేటర్లు, నాగళ్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, డ్రోన్లు ఉన్నాయి. అర్హులైన ప్రతీ రైతుకు పథకాన్ని వర్తింపజేసేందుకు పలు ఆధునిక పరికరాలను అధికారులు అందించనున్నారు. అయితే ఈసారి ట్రాక్టర్లను ఈ పథకం కింద కేటాయించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్ల మంజూరు వివాదాస్పదమైంది. దీంతో ప్రభుత్వం ట్రాక్టర్లను ఈ పథకంలో చేర్చలేదు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కట్టంగూరు: సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవీందర్

కట్టంగూరు, చండూరు, శాలిగౌరారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు, యువకులు అప్రమత్తంగా ఉండాలని, వాటిపై అవగాహన పెంచుకోవాలని కట్టంగూరు, చండూరు ఎస్‌ఐలు రవీందర్, వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ జిల్లపల్లి శ్రీనివాస్ అన్నారు. కట్టంగూరులోని సాందీపని ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది వెం కన్న, సతీష్, దుర్గప్రసాద్, శంకర్, శ్రీను, పాఠశాల హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● చండూరు పట్టణంలో డాన్‌బోస్కో కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐ వెంకన్న మాట్లాడారు. మొబైల్ వల్లే 80శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్‌నేరాలకు కొందరు పాల్పడుతున్నారని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండల కేంద్రంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జిల్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సైబర్ నేరాలు కంప్యూటర్, మొబైల్ నెట్‌వర్క్ తో పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పరమేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రభంజన్, కానిస్టేబుళ్లు మర్రి జానయ్య, గాదే మనోహర్, నక్క సునీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిశువుకు ముర్రుపాలు తాగించాలి

చండూరు, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ అన్నారు. చండూరు మునిసిపాలిటీలో ఉన్న అంగన్‌వాడీ 1, 2, 6 కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లి పాలలో ఉండే పోషక విలువలు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని, తర్వాత అనుబంధ పోషకాహారాన్ని అందించాలని సూచించారు. ముర్రు పాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతందన్నారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కేదారి, సునీత, జగదీశ్వరి, ఏఎన్ఎం సౌజన్య, మునిషాబేగం, సరస్వతి, సంధ్య, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కళాకారుల ప్రదర్శనలు

ఘనంగా గద్దర్‌కు నివాళి

మునుగోడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మునుగోడు బీఆర్. అంబేడ్కర్ చౌరస్తాలో తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రజాయుద్ధ నౌక గద్దర్ ద్వితీయ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గద్దరన్న యాదిలో కళాకారులు ప్రదర్శించిన ఆట, పాట, మాటలు అందరినీ అలరించాయి. ముందుగా డప్పు వాయిద్యాలతో కళాకారులు హైస్కూల్ నుంచి స్థానిక ప్రధాన కూడలికి ప్రదర్శనగా వచ్చారు. చౌరస్తాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభలో గద్దర్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. అంబేడ్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేశారు. మహిళా కళాకారులు కాలికి గజ్జలు కట్టి డప్పు కొట్టుకుంటూ ప్రత్యేక ఆకర్షణ గా నిలిచారు. కార్యక్రమంలో మునుగోడు గద్దర్ వనం లింగయ్య, మాల్గా యాదన్న, మేడి సైదులు, రడం నర్సింగ్‌రావు, బొల్గూరి ఉపేందర్, కొప్పు సంజీవ, కాటపాక శంకర్, గంట నాగరాజు, బొల్గూరి రవీందర్, బొమ్మగోని లింగస్వామి, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం


శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



ఉరుమడ్లలో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

చిట్యాలరూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని, ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడే వారికి ఆపదలో ఆదుకుంటుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం ఉరుమడ్లలో బుధవారం పలువురికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. పేద సామాన్య కుటుంబాలకు చెందిన వారు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుని ఆసుపత్రుల బిల్లులు వారి వివరాలను సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంటే డబ్బులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉరుమడ్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మండలి చైర్మన్ పరామర్శించారు. గ్రామానికి చెందిన కుంభం నారాయణ, బెలిజ శివ, గుండగోని నరేష్ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించారు.కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కోనేటి యాదగిరి, చెరుకు సైదులు, పోలగోని స్వామి, పట్ల జనార్దన్, జన్నపాల శ్రీను, మర్రి రమేష్, కురుపటి లింగయ్య, పాకాల దినేష్, ఉయ్యాల నరేష్ పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల ముందస్తు అరెస్టు



కట్టంగూరు: పోలీస్ స్టేషన్ ఆవరణలో మధ్యాహ్న కార్మికులు

కట్టంగూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాల బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ చలో హైదరాబాద్ కమిషనరేట్ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న కట్టంగూరుకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులను కట్టంగూరు పోలీసులు బుధవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో మధ్యాహ్న భోజన కార్మికులు మాచర్ల యాదమ్మ, కంకణాల శోభరాణి, మంగమ్మల ఉన్నారు.

● మర్రిగూడ: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఎరుపుల యాదయ్య అన్నారు. బుధవారం మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యల పరిష్కారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తుండగా సీఐటీయూ నాయకులను పోలీసుల ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల కనీస వేతనాలు అందించాలంటూ, వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట రామలింగ చారి, నీలకంఠం, యాదయ్య ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీలో పాల్గొన్న పెన్షనర్లు

నల్లగొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెన్షనర్ల సమన్వయ సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పన్నాల గోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాలలో బుధవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. గత ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. 11న ఇందిరాపార్కు వద్ద జరిగే పెన్షనర్ల మహాసభకు జిల్లా నుంచి వేలాది మంది పెన్షనర్లు తరలిరావాలని కోరారు. 398 మంది స్పెషల్ టీచర్లకు నేషనల్ ఇంక్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఏఎమ్మార్పీ నీటితో చెరువులు, కుంటలు నింపాలి



సమావేశంలో మాట్లాడుతున్న చినవెంకులు

కేతేపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం మండలంలోని మూసీ ఆయకట్టేతర గ్రామాల చెరువులు, కుంటలను ఏఎమ్మార్పీ నీటితో నింపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు కోరారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాభావంతో భూగర్భజలాలు అడుగంటి మండల రైతులు పంటలను సాగు చేసే పరిస్థితులు లేకుండా పోయాయన్నారు. సాగర్ ప్రాజెక్టు వరద నీటితో పొంగి పొర్లుతున్నా ఏఎమ్మార్పీకి నీటిని విడుదల చేయకపోవడం సరైందికాదన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఏఎమ్మార్పీ నీటితో చెరువులు, కుంటలు నింపేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ మం డల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు ఎల్.రాజు, ఎ.అశోక్‌రెడ్డి, కె.లింగయ్య, వి.సైదయ్య, కె.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి : సీపీఎం



పట్టణంలోని మురికి కాల్వలను పరిశీలిస్తున్న సీపీఎం బృందం

నల్లగొండ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య అన్నారు. స్థానిక సమస్యల పరిశీలన కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 11వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 11వ వార్డులో మురికికాల్వల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో మురికికాల్వల నుంచి పోవాల్సిన మురికి నీరు రోడ్ల పైనుంచి పారుతుందని అన్నారు. డ్రైనేజీ కాల్వలు సక్రమంగా లేక కాలనీల మధ్యలో నీరు నిలిచిపోవడం వల్ల దోమలు పెరుగుతున్నాయని అన్నారు. అంతేకాక దుర్వాసన వెలువడటంతో కాలనీ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మునిసిపల్ అధికారులు అర్బన్ కాలనీ సందర్శించి అవసరమైన అన్నిచోట్ల మురికికాల్వలను నిర్మించాలని, చెత్తాచెదారంతో నిండిన గ్రౌండ్‌ను శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యురాలు దండేపల్లి సరోజ, నాయకులు పనస చంద్రయ్య, దండెంపల్లి మారయ్య, పల్లె నగేష్, పామన గుండ్ల రాజు, ముచ్చర్ల విజయ్, దాసరి ప్రశాంత్, గడిగల సత్తెమ్మ, ముగుదాల లింగమ్మ, శరత్, కల్యాణి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ విగ్రహం, కళావేదిక ప్రారంభం

నార్కట్‌పల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచిగా చదువుకుని ప్రయోజకులు కావాలని ప్రముఖ న్యాయవాది రేగట్టె భూపాల్‌రెడ్డి, రేణుక అన్నారు. ఎల్లారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థి ప్రముఖ న్యాయవాది రేగట్టె భూపాల్‌రెడ్డి, అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆయన సతీమణి రేగట్టె రేణుకలు దాతలుగా సుమారు రూ.2లక్షల అంచనా వ్యయంతో కళావేదిక, చదువుల తల్లి సరస్వతీమాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం వారు కళావేదిక, సరస్వతీమాత విగ్రహాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో కూకుట్ల నర్సింహ, పాఠశాల హెచ్‌ఎం హిమజ, చెర్వుగట్టు దేవస్థాన ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, నాయకులు వడ్డే భూపాల్‌రెడ్డి, నేతకాని కృష్ణయ్య, సాగర్ల సైదులు, గడుసు శశిధర్‌రెడ్డి, రేగట్టె నవీన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థుల కోసం పక్షోత్సవాలు

నార్కట్‌పల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీలింగోటం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువులో వివిధ కారణాల దృష్ట్యా వెనుకబడిన విద్యార్థుల కోసం చదువుల పక్షోత్సవం అనే కార్యక్రమానికి ఉపాధ్యాయులు సంకల్పించారు. ఇందులో భాగంగా 15 రోజుల పాటు ప్రతీ రోజు సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక తరగతులు తీసుకుని వారికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అన్ని సబ్జెక్టులలోనూ చదవడం, రాయడం వంటి సామర్థ్యాలను మెరుగుపర్చాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు హెచ్‌ఎం మల్లేపల్లి కాశయ్య అన్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణకు ముందుకువచ్చి ఉపాధ్యాయులను ప్రోత్సహించిన మణిరాజును అభినందించారు.

లక్ష్మీనారాయణ దేవస్థానంలో ఏకాదశి మహాయజ్ఞం

కట్టంగూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కట్టంగూరులోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో బుధవారం భక్తులు ఏకాదశి మహాయజ్ఞాన్ని నిర్వహించారు. ఆలయ పూజారి రామడుగు శ్రీనివాస్‌శర్మ, రామడుగు అశ్విన్‌శర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతి ఘనంగా చేపట్టారు. లక్ష్మీనారాయణస్వామి విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో రామడుగు శశిరేఖ, శోభ, మంగమ్మ, కృష్ణవేణి, పద్మ, స్వాతి, మణెమ్మ, లక్ష్మీ, సంధ్య, నాగమణి, పావని, పద్మ, ఇందిరమ్మ, రెడ్డిపల్లి మనోహర్, ఓరుగంటి రమేష్, రెడ్డిపల్లి సైదులు, బండారు అరుణ్, కాపుగంటి గోపి, రాపోలు విజయ్, గోపి పాల్గొన్నారు.


ఎస్పీసీని పునఃప్రారంభించాలి



వినతి పత్రం అందజేస్తున్న యూసుఫుద్దీన్

నల్లగొండ క్రైం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కరోనా సమయం నుంచి తాత్కాలికంగా నిలిచిన స్టూడెంట్ పోలీస్ క్యాడెట్ (ఎస్పీసీ) తిరిగి ప్రారంభించాలని ఆ పాఠశాల హెచ్‌ఎం ఎండీ యూసుఫుద్దీన్ కోరారు. బుధవారం జిల్లా ఏఎస్పీ జి.రమేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూసుఫుద్దీన్ మాట్లాడుతూ ఎస్పీసీ శిక్షణ ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి, మంచి అలవాట్లు అలవడుతాయన్నారు. ఈ విషయంపై ఏఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీసీ ఇన్‌చార్జి సీఐ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 33.0
కనిష్ఠం 23.4
ANDHRAJYOTHY




నల్లగొండ
5
గురువారం 7 ఆగస్టు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.90 (306.0414)	44,108	66,131
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643 (3.94)	464.90	620.42
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.8661)	29,401	45,112

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220

నకిలీలు ఇంటికే!



- కొనసాగుతున్న విచారణ
- అడ్డుకునేందుకు రాజకీయ ప్రయత్నాలు

నల్లగొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రెండేళ్ల క్రితం అక్రమంగా క్రమబద్ధీకరణ పొందిన ఇంటర్ అధ్యాపకుల్లో నకిలీలపై చర్యలకు రంగం సిద్ధమవుతుండగా, దీనిని తప్పించుకునేందుకు రాజకీయ పైరవీలు ఊపందుకున్నాయి. ఇంటర్ అధ్యాపకులుగా క్రమబద్ధీకరణ పొందిన వారిలో పలువురు నకిలీ ధ్రువపత్రాలు సమర్పించారని ఇంటర్ బోర్డుకు ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలో జూలైలో వరంగల్ ఆర్జేడీ అధ్యక్షతన విచారణ కమిటీని నియమించింది. ఈ కమిటీ ఇప్పటికే రెగ్యులరైన అధ్యాపకుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభించింది. పలువురి సర్టిఫికెట్లపై అభ్యంతరాలను నమోదు చేసినట్లు సమాచారం రావడంతో అప్రమత్తమైన నకిలీ అధ్యాపకులు రాజకీయ పైరవీలతో పోస్టులను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలుస్తోంది.

నకిలీలను గుర్తించిన విచారణ కమిటీ

ఆర్జేడీ కార్యాలయ అధికారులు తాజాగా విచారణలో నల్లగొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023లో రెగ్యులర్ అయినా లెక్చరర్ల ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాలకు చెందిన తెలంగాణలో అనుమతిలేని యూనివర్సిటీల సర్టిఫికెట్‌లను గుర్తించి ఆ వివరాలు నమోదు చేసినట్లు తెలిసింది. జిల్లాకు సంబంధించి 18మందికి చెందిన సర్టిఫికెట్లపై అభ్యంతరాలు నమోదు చేశారని సమాచారం. అదేవిధంగా సూర్యాపేట జిల్లా పరిధిలో ఆరుగురి పత్రాలపైనా అభ్యంతరాలు నమోదు చేసినట్టు తెలిసింది. వీటన్నిటినీ మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి తప్పుడు సర్టిఫికెట్లు అని తేలితే వారిని సర్వీస్ నుంచి తొలగించడమేగాక, క్రిమినల్ కేసులు సైతం నమోదు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. మరోవైపు విచారణను నిలువరించేందుకు, ఉద్యోగాలు కాపాడుకునేందుకు నకిలీ అధ్యాపకులు రాజకీయ పైరవీలు మొదలుపెట్టారు. ఓ కీలక మంత్రికి సన్నిహితుడి ద్వారా రాజకీయ ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఉద్యోగాలు పోకుండా కాపాడితే అందరూ కలిసి రూ.కోటి వరకైనా సదరు నేత ద్వారా అధికారులకు ఇస్తామని వర్తమానం పంపారని సమాచారం. అయితే అధికారులు మాత్రం ప్రధానంగా నల్లగొండ జిల్లా నుంచే ఫిర్యాదులు రావడంతో చర్యలు తీసుకోవడానికే మొగ్గు చూపినట్లు తెలిసింది. ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్‌కు ఈ నెలలోనే పూర్తి విచారణ నివేదిక అందిస్తారని, అనంతరం చర్యలు ఉంటాయని తెలుస్తోంది.

వ్యవసాయ యాంత్రీకరణ షురూ



- దరఖాస్తులను స్వీకరిస్తున్న వ్యవసాయశాఖ
- పకడ్బందీగా అమలుకు ఉన్నతాధికారుల సమీక్ష
- వచ్చే నెల 17 నుంచి పరికరాల పంపిణీ
- రైతులు అడిగిన కంపెనీ పరికరమే కేటాయింపు

ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం ప్రక్రియ ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మొదలైంది. గతంలో ఉన్న ఈ పథకానికి మార్పులు చేర్పులతో నూతన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా యాంత్రీకరణ పథకం అమలుకు వ్యవసాయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ

యాంత్రీకరణ పథకానికి ఉమ్మడి జిల్లాలో వ్యాప్తంగా ఈనెల 5వ తేదీ నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రూపొందించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో పలు సవరణలు చేశారు. 2025-26 ఆర్థిక సంవవత్సరానికి ఈ పథకాన్ని వర్తింపజేసేందుకు ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు రూ.6.18కోట్లను కేటాయించింది. నల్లగొండ జిల్లాకు రూ.3.14కోట్లు, సూర్యాపేటకు రూ.1.84కోట్లు, యాదాద్రి జిల్లాకు రూ.1.24కోట్లు కేటాయించింది. అందులో కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులను, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను భరించనున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ ఇవ్వనుండగా, జనరల్ కేటగిరీ రైతులకు 40శాతం సబ్సిడీ వర్తిస్తుంది. ఈ పథకం ప్రస్తుత వానాకాలం నుంచి యాసంగి వరకు పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు. జిల్లా ఉన్నతాధికారులు మండల ఏఈవోలు, ఏవోలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పథకం అమలుకు ఆదేశాలు జారీ చేశారు.

దరఖాస్తుల చివరి గడువు 15

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి సంబంధించి ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తులకు తుది గడువు విధించారు. గతంలో దరఖాస్తు చేసిన రైతుల దరఖాస్తులను సైతం ఈ మారు పరిగణనలోకి తీసుకోవడంతో పాటు కొత్త దరఖాస్తులన్నింటినీ పరిశీలిస్తారు. గతంలో ఉన్న దరఖాస్తులతో పాటు కొత్త దరఖాస్తులను కలెక్టర్లకు పంపిస్తారు. మూడు జిల్లాల కలెక్టర్లు ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు వాటిని పరిశీలిస్తారు. ఒకవేళ దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు సంబంధించి కారణాలను రైతులకు తెలియజేస్తారు. 21 నుంచి 27వ తేదీ వరకు ఎంపికైన రైతుల నుంచి డీడీలు తీసుకుంటారు. 27 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు మంజూరు పత్రాలు అందజేస్తారు. అదే నెల 7 నుంచి 17వ తేదీలోగా రైతులకు పరికరాలు పంపిణీ చేస్తారు. కూలీల కొరత ఉన్న ప్రస్తుత

మిగతా 8వ పేజీలో...

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



యాంత్రీకరణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం ఆదేశాల మేరకు అమలు చేస్తున్న ఈ పథకాన్ని రైతులకు చేరవేస్తాం. యాంత్రీకరణ పథకం రైతులకు ఎంతగానో ఉపయోగంకానుంది. ఆధునిక పరికరాలతో వ్యవసాయం చేయడం వల్ల సమయం ఆదా కావడంతో పాటు అధిక దిగుబడులకు కూడా అవకాశం ఉంటుంది. ఈ నెల 15 వరకు దరఖాస్తులు తీసుకొని లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసిన అనంతరం సెప్టెంబరు 17లోగా పరికరాలను అందజేస్తాం. అర్హులైన ప్రతీ రైతుకు పథకాన్ని వర్తింపజేస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ రైతులకు 50శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40శాతం సబ్సిడీ ఉంది.

● పి. శ్రవణ్‌కుమార్, జేడీఏ

ఈ-పాస్ ద్వారా ఎరువులు విక్రయించాలి

జేడీఏ శ్రవణ్‌కుమార్



రికార్డులను పరిశీలిస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

డిండి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు ఈ-పాస్ యంత్రం ద్వారానే ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని డిండి, తవక్లాపూర్ సొసైటీలతోపాటు రైతు ఆగ్రో సేవా కేంద్రం, సాయి ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిలువలను అడిగి తెలుసుకున్నారు. ఎరువులు కొనుగోలు చేసే రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. ఎరువుల నిల్వల వివరాలు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అయన వెంట ఏవో రెహానా, సీడ్‌ఫామ్ ఏవో రామలింగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



కేతేపల్లిలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కేతేపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏపీఎంలతో కేతేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. అధికారులు సమర్పించిన ప్రగతి నివేదికలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కాకపోవడానికి ఆయా మండలాల అధికారులు తెలిపిన కారణాలు సహేతుకంగా లేవన్నారు. ఇళ్ల నిర్మాణాల బాధ్యత మండల స్థాయి అధికారులపైనే ఉందన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు చొరవ తీసుకుని నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. ఈ నెల 13 వరకు అన్ని మండలాల్లో ఇళ్ల నిర్మాణాల్లో 20శాతం పురోగతికి చేరుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు ఇసుక, సిమెంట్, ఇతర సామగ్రిలో సమస్యలు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. 'మన ఇసుక-మన వాహనం' ద్వారా ఇసుక అందించేలా తహసీల్దార్‌లు, ఆర్డీవోలు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఇంటిని నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేనివారిని గుర్తించి సమభావన సంఘాల ద్వారా రూ.లక్ష రుణం ఇప్పించేందుకు ఈ నెల 8వరకు జాబితాలను బ్యాంకులకు అందజేయాల్సిన బాధ్యత ఏపీఎంలదేనన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్లు రమాదేవి, పి.వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, జి.కృష్ణ, ఎంపీడీవోలు బి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, జయలక్ష్మి, ఉమేష్, జ్ఞానప్రకాశ్, పాల్గొన్నారు.

అన్ని రకాల వైద్య సేవలను అందించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల ద్వారా అన్ని రకాల వైద్య సేవలను అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం మాన్యంచెల్క పట్టణ వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఓపీ, ఏఎన్‌సీ, మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పక్కనే నిర్మిస్తున్న మాన్యంచెల్క యూపీహెచ్‌సీ నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించి, పనులు పూర్తయినందున ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, తదితరులు ఉన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కొత్త విధానం

మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్



విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి కొత్త విధానం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపు మైదానంలో నిర్వహించిన లిటిల్ ఛాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రికెట్ జట్టును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతీ పూర్వ జిల్లాలో క్రీడా పాఠశాల, ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో మినీ స్టేడియాలను ఏర్పాటు చేసేలా క్రీడాపాలసీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడా కోటాలో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు పొందాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మానాయక్ మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థులు కప్ గెలుచుకోవడం ఆనందంగా ఉందన్నారు. పోటీల్లో ఆల్‌రౌండర్ ప్రతిభ కనబర్చిన యోగిరామ్ మ్యాన్ ఆఫ్‌ది సిరీస్, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా సాయికిరణ్ ప్రత్యేక బహుమతులు అందుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణకాంత్‌నాయక్, స్వామి, ఉపేందర్, ముంతాజ్‌బేగం, తావురియా, అనిత, జ్యోతి, స్పందన, అశ్విని, భవాని, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలను ప్రభుత్వమే నిర్వహించాలి

సాగునీటి సంఘాల జిల్లా అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి



ఎత్తిపోతల పథకంలోని మోటార్లను పరిశీలిస్తున్న శశిధర్‌రెడ్డి

వేములపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సాగర్ ఎడమకాల్వపై ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహించి రైతులను ఆదుకోవాలని సాగునీటి సంఘాల జిల్లా అధ్యక్షుడు పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సాగర్ ఎడమకాల్వపై ఎత్తిపోతల పథకాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. దశాబ్దకాలం క్రితం సాగర్ ఎడమకాల్వ ఆధునికీకరణలో భాగంగా గతంలో ఎత్తిపోతలలోని మోటార్ పంపుసెట్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు మాత్రమే చేశారని అన్నారు. ప్రస్తుతం మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైనింగ్‌లు మరమ్మతులకు గురై అస్తవ్యస్తంగా మారాయన్నారు. వాటి మరమ్మతులకు లక్షల రూపాయలు ఖర్చవుతోందని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అంచనాలు వేస్తున్నారే తప్ప నిధులు మంజూరు కావడం లేదన్నారు. ఈఎన్‌సీ ఆఫీసులో కమిటీ పరిశీలన చేసి నిధులు మంజూరు చేయడంలో జాప్యమవుతోందని, తామేమి చేయలేమని, రైతులే నిధులు సమీకరించుకోవాలని ఎన్నెస్పీ అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఎత్తిపోతల నిర్వహణ బాధ్యత వెంటనే తీసుకోవాలన్నారు. ఈఎన్‌సీ కమిటీతో సంబంధం లేకుండా నేరుగా మరమ్మతులకు నిధులు కేటాయించి ఆయకట్టు రైతులకు నీరందించాలన్నారు. అదేవిధంగా సిబ్బందిని సైతం ప్రభుత్వమే నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు కొమ్మగాని ఎల్లయ్య, సోమనబోయిన సైదులు, నాగయ్య, వెంకన్న, లింగయ్య, ఎరుకలయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు



మిర్యాలగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించడంతో గాడి తప్పిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు విమర్శించారు. గత నెల 30వ తేదీ నుంచి చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర ముగింపు సందర్భంగా బుధవారం పట్టణంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విద్యారంగం పూర్తిగా గాడితప్పిందన్నారు. సంక్షేమ రంగాన్ని పూర్తిగా విస్మరించడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. పెండింగ్‌లో ఉన్నా స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో ఎన్నడూ విద్యారంగ సమస్యలపై క్యాబినెట్‌లో చర్చించకపోవడం శోచనీయమన్నారు. పలు పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్ల వసతి లేదని ఆరోపించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు భోజనానికి కేవలం రూ.10 చెల్లిస్తుండడంతో ఏజెన్సీలు అప్పు చేసి వడ్డించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పాఠశాలలను అభివృద్ధి చేయకుండా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో 5వేల మందిని ఒకే చోట ఉంచి చదివించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎనిమిది రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పర్యటించి సమస్యలను అధ్యయనం చేసిన యాత్రా బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మూడావత్ రవినాయక్, పరుశరాం, వరలక్ష్మి, ధీరావత్ శ్రీను, కుర్ర సైదానాయక్, కుంచం కావ్య, కోరి రమేష్, రవిందర్, కిరణ్, స్పందన, జగదీశ్, వినోద్ సిద్ధు, శంకర్, సూర్య, పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

డీఈవో భిక్షపతి

నిడమనూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు మెనూ పాటిస్తూ బాలికలకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు, వంటగది, స్టోర్ రూము, పరిసరాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. బాలికలు, సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో సివిల్ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. పలు పాఠ్యాంశాలపై విద్యార్థినులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులకు సంబంధించి ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, బాలికలకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఎంఈవో లావూరి వెంకన్న, పాఠశాల ప్రత్యేకాధికారి పద్మారాణి ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

నల్లగొండ క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని అదనపు ఎస్పీ రమేష్, సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ ఆడిటోరియంలో ప్రగతి కళాశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. విద్యావంతులే సైబర్ నేరాలబారినపడి మోసాలకు గురవుతున్నారని అన్నారు. అందుకే సైబర్‌నేరాలను అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్న సైబర్ నేరాలపై అంతా జాగ్రత్తగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఎంఎస్‌లు, ఈ-మెయిల్స్, వాట్సప్, ట్విట్టర్ ద్వారా వచ్చే బ్లూకలర్ లింకులను క్లిక్ చేసి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, సైబర్‌క్రైం ఎస్ఐ విష్ణు, టూటౌన్ ఎస్ఐ సైదులు, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజన కార్మికులకు

రూ.10వేలు చెల్లించాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

దేవరకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.10వేల వేతనం అందజేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. దేవరకొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులు అప్పులు చేసి భోజనం వండుతున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారి అయూబ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జూలూరి వెంకట్రాములు, మల్లయ్య, నోముల ధనలక్ష్మి, వెంకటమ్మ, శోభరాణి, మౌనిక, బుజ్జమ్మ, పాల్గొన్నారు.



చేనేతకు చేయూత

- కాంగ్రెస్ హయాంలో పలు పథకాలకు కొత్త రూపు
- అధికారులు సమన్వయంతో పనిచేస్తే నేతన్నలకు లబ్ధి

7

అమృత్..ఆలస్యం

- మందకొడిగా అమృత్-2 పనులు
- ఇప్పటి వరకు జరిగిన పనులు 34 శాతమే
- తాగునీటి ఎద్దడి నివారణకు రూ.491.39 కోట్లు

6

మొల్కచర్లకు బస్సును పునరుద్ధరించాలి

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అడవిదేవులపల్లి మండలం మొల్కచర్ల గ్రామానికి బస్సును పునరుద్ధరించాలని కోరుతూ ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ భారతీబాయికి గ్రామస్థులు బుధవారం వినతిపత్రం అందజేశారు. మూడేళ్ల కాలంగా బస్సు సర్వీసును రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్, గ్రామస్థులు భరత్‌కుమార్, రమేష్, మునికుమార్, జగన్, శ్రీనివాస్, వెంకన్న తదితరులున్నారు.

టై, బెల్టులు అందజేత

కొండమల్లేపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నఅడిశర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో దాత ఇంద్రకంటి వినయ్‌కుమార్‌రెడ్డి సహకారంతో 50 మంది విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. పోతురాజు వెంకటేశ్వర్లు సహకారంతో బీరువాను బహూకరించారు. మరో దాత ముడావత్ శంకర్ పాఠశాలకు ప్లాస్టిక్ కుర్చీలను అందజేశారు. దాతలను ఎంఈవో నాగేశ్వర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో దాత పిల్లి మల్లేష్, హెచ్ఎం కోటయ్య, నీల స్వరాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలం కబ్జా?

» మొక్కలు నాటకుండా అడ్డుకున్న వైనం » పట్టించుకోని రెవెన్యూ అధికారులు » కలెక్టర్ ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

(ఆంధ్రజ్యోతి-త్రిపురారం)

చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్న కబ్జాదారులు చివరకు శ్మశాన వాటిక స్థలాన్ని సైతం వదలడం లేదు. త్రిపురారం మండలం కంపసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని కోమటిగూడెం గ్రామ ప్రజలు 50 ఏళ్లుగా వినియోగిస్తున్న శ్మశాన వాటిక స్థలాన్ని కొందరు కబ్జాకు పాల్పడ్డారు. గ్రామస్థులు ఉపాధి హామీ పథకంలో భాగంగా శ్మశాన వాటికలో మొక్కలు నాటడానికి ఇటీవల గుంతలు తీస్తుండగా కబ్జాదారులు అడ్డుకున్నారు. రెండేళ్ల క్రితం ఓ వ్యక్తి చనిపోవడంతో అంత్యక్రియల కోసం శ్మశానంలో ఏర్పాట్లు చేస్తుండగా ఓ వ్యక్తి కుటుంబం సహా వచ్చి అడ్డుకోవడంతో వివాదం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అంత్యక్రియలను అడ్డుకున్నారు. దాంతో గ్రామస్థులు త్రిపురారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. చివరికి పోలీసుల సాయంతో రెవెన్యూ అధికారులు తాత్కాలికంగా సమస్యను పరిష్కరించారు. శ్మశానికి హద్దులు ఏర్పాటు చేస్తామని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చినా ఏళ్లు గడిచినా అధికారులు పట్టించుకోలేదు. తహసీల్దార్, ఆర్డీవోతో పాటు కలెక్టర్ ఫిర్యాదు చేశారు.. అయినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దాంతో కబ్జాదారులు మరోసారి శ్మశానికి ఆక్రమణకు పూనుకున్నారు.. ప్రస్తుతం శ్మశానవాటిక స్థలానికి నీరు పెట్టి పంటల సాగుకు సిద్ధమవుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు.


త్రిపురారం మండలం కోమటిగూడెం శ్మశానవాటిక స్థలం

అంతా ప్రభుత్వ స్థలమే..

కోమటిగూడెం గ్రామంలో 275 సర్వే నంబర్‌లోని భూమిని 30 ఏళ్ల క్రితం ఓ ఆర్మీ జవాన్‌కు 2 ఎకరాల 8 గుంటల భూమిని ప్రభుత్వం కేటాయించింది. అతడు ఈ భూమిని పదేళ్ల క్రితం దుగ్గేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి విక్రయించాడు. ఆ భూమి పక్కనే ఉన్న వ్యక్తి మరో రెండు ఎకరాలను ఆక్రమణ చేసి సాగు చేస్తున్నాడు. అందులో ఎకరం భూమిని ఇతరులకు రూ.12లక్షల వరకు విక్రయించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు.. చివరకు అతడు శ్మశానం ఆక్రమణకు పాల్పడినట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. శ్మశానంలో అడుగు పెట్టకుండా అడ్డుకుంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేయడానికి స్థలం కరువైంది. మా పెద్దల కాలం నాటి నుంచి ఉన్న శ్మశానాన్ని పక్కన స్థలం ఉన్న వ్యక్తి కబ్జాకు పాల్పడుతున్నాడు. చాలా ఏళ్లుగా అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. శ్మశానాన్ని ఆక్రమణదారుల చెర నుంచి విడిపించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

-అనుముల సైదులు, కోమటిగూడెం

హద్దులు ఏర్పాటు చేయిస్తాం

ప్రస్తుతం రెవెన్యూ సదస్సుకు సంబంధించిన పనుల్లో ఉన్నాం. శ్మశాన వాటిక స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయిస్తాం.

-ప్రమీల, తహసీల్దార్, త్రిపురారం

రోడ్లపై వాహనాలు నిలిపితే చర్యలు

● వెంకట్‌రెడ్డి, సీఐ, దేవరకొండ



ఇంటర్వ్యూ Interview

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

రోడ్లపై వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే జరిమానాతోపాటు కేసులు నమోదు చేస్తామని దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. త్వరలో ఆటో యూనియన్, ఆర్టీసీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి: దేవరకొండలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

సీఐ: పట్టణంలో రోడ్లపైనే వాహనాలు నిలిపినవారికి జరిమానాలు విధించి కేసులు నమోదు చేస్తాం. త్వరలో ఆర్టీసీ ఉద్యోగులు, ఆటో యూనియన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తాం

ఆంధ్రజ్యోతి: పట్టణంలో సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా ?

సీఐ: దేవరకొండలో 20వరకు ప్రస్తుతం సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. కొన్ని మరమ్మతులకు గురైనప్పటికీ రిపేరు చేపడుతాం. త్వరలో 80కిపైగా పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: భూకబ్జాదారులు బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై ఎలాంటి చర్యలు చేపడుతారు?

సీఐ: ప్రభుత్వ భూముల కబ్జాలు, బెదిరింపు, దాదాగిరి చేసేవారిపై నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేదిలేదు.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరాలపై ఎలాంటి చర్యలు చేపడుతారు?

సీఐ: సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తాం. కొత్త వారికి ఓటీపీ, ఆధార్ నంబర్ ఇవ్వొద్దు

ఆంధ్రజ్యోతి: మైనర్లు వాహనాలు నడిపితే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

సీఐ: మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులదే బాధ్యత. మైనర్లు వాహనాలు నడిపిస్తే గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తాం. తల్లిదండ్రులను పిలిపించి హెచ్చరికలు జారీ చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ఇసుక అక్రమ రవాణాపై ఎలాంటి చర్యలు చేపడుతారు?

సీఐ: వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం. వాగుల వద్ద నిఘా ఏర్పాటు చేస్తాం. పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల ప్రజలు పోలీసులకు సహకరించాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

ప్రజా ఉద్యమాలే శరణ్యం : సీపీఎం


నిడమనూరులో స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నిడమనూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలే శరణ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. నిడమనూరుకు చెందిన సీఐటీయూ జిల్లా నాయకుడు దివంగత గోగుల వెంకన్న 5వ వర్ధంతి సందర్భంగా ఆయన స్మారకార్థం మండల కేంద్రంలో నిర్మించిన స్థూపాన్ని బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా ఉద్యమాలకు ఆకర్షితుడైన వెంకన్న తమ పార్టీతో అనుబంధం పెంచుకొని ప్రజా సమస్యల కోసం అనేక పోరాటాలు చేశాడని కొనియాడారు. అనంతరం సీపీఎం నాయకుల బృందం స్థానిక నల్లచౌట చెరువు వద్ద నిర్మిస్తున్న మినీ ట్యాంక్‌బండ్ పనులను పరిశీలించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు చినపాక లక్ష్మీనారాయణ, కొండేటి శ్రీను, కత్తి లింగారెడ్డి, కందుకూరి కోటేష్, మల్లికంటి చంద్రశేఖర్, వింజమూరి శివ, దుబ్బ రామచంద్రయ్య, రవినాయక్ పాల్గొన్నారు.

పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలి


సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

హాలియా,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కాట్నం యాదగిరిగౌడ్ కోరారు. హాలియాలో బుధవారం నిర్వహించిన తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వేములకొండ పుల్లయ్య మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర ఈనెల 2వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కల్లుగీత వృత్తిలో అమరులైన వారిని యాది చేసుకుంటూ నివాళులర్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు బొడ్డు లక్ష్మి, నర్సింగ్ సైదులు, కాసాని సత్తయ్య గౌడ్, వడ్డగోని వెంకన్న, వడ్డగోని యాదయ్య, పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ


సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

కొండమల్లేపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు చేపటిన ఉపాధి హామీ పనులపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో 4వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో సుమారు రూ.5.50 కోట్ల కింద జరిగిన పనులకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. జిల్లా అధికారులు ఈ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. తనిఖీ అనంతరం విజిలెన్స్ అధికారి వేణుగోపాలరావు మాట్లాడుతూ ఈ రోజు జరిగిన సామాజిక తనిఖీ పరంగా గ్రామపంచాయతీల్లో విధు లు నిర్వహించే ఉద్యోగులు సరైన రికార్డులను ఏర్పాటు చేసుకోవాలని ఇప్పటివరకు ఈ మండలంలో పనిచేసే ఉద్యోగులపై దాదాపుగా 1,342 అభ్యంతరాలు ఉన్నాయని వాటికి సంబంధించిన ఉద్యోగుల సంజాయిషీ ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ తనిఖీలో అసిస్టెంట్ క్లస్టర్ పీడీ యామిని, జిల్లా విజిలెన్స్ అధికారి వేణు గోపాలరావు, క్వాలిటి కంట్రోల్ పసియుద్దీన్, ఎంపీడీవో బాలరాజురెడ్డి, ఏపీవో రామచంద్రనాయక్, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ శ్రీకాంత్, రాజు టెక్నికల్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి

దేవరకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులకు స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని మాజీ సైనికుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం దేవరకొండ రహదారి బంగ్లా ఎదుట నిర్వహించిన సమావేశంలో ఆసంఘం నాయకులు మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాటం చేసి ఉద్యోగ విరమణ పొందామని తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. దేవరకొండలో 40 మంది వరకు మాజీ సైనికులు ఉన్నారని వారందకీ ఇంటి స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మించాలని అధికారులను కోరారు. సమావేశంలో మాజీ సైనికుల సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, శీనయ్య, వెంకటేష్, నర్సింహులు, శ్రీనివాసరావు, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ సార్, గద్దర్ స్ఫూర్తిని కొనసాగించాలి

● ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతి సందర్భంగా పలు మండలాల్లో నివాళులర్పించిన నాయకులు, ప్రజా ప్రతినిధులు

మిర్యాలగూడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ప్రజాస్వామిక తెలంగాణగా మార్చడమే ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్‌కు మనం ఇచ్చే నివాళి అని తెలంగాణ విద్యావికాస వేదిక వ్యవస్థాపక కన్వీనర్ కస్తూరి ప్రభాకర్ అన్నారు. బుధవారం జయశంకర్ 91వ జయంతి, గద్దర్ వర్ధంతి సందర్భంగా స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ భవన్‌లో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ భౌగోళిక తెలంగాణ మన ప్రాంతాన్ని మనం పాలించుకునే అవకాశం మాత్రమే దక్కిందన్నారు. తెలంగాణను ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో సకల జనుల ఆ కాంక్షను నేరవేర్చడమే వారి స్వప్నమని అన్నారు. అనంతరం జయశంకర్ జీవిత చరిత్ర, ఇంటర్వ్యూ 'ఒడవని ముచ్చట' పుస్తకాలను పంపి ణీ చేశారు. కార్యక్రమంలో సా మాజిక వేత్త డాక్టర్ రాజు దాసరాజు రాజు, కోల సైదులు, ఈశ్వరాచారి, నాగార్జునాచారి, పెద్ది శ్రీను పాల్గొన్నారు.


మిర్యాలగూడ : జయశంకర్ సార్, గద్దర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న విద్యావికాస వేదిక నాయకులు

● స్థానిక జూనియర్ కళాశాల వద్ద జయశంకర్ విగ్రహానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ సార్ తెలంగాణ ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి అని అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమం లో అన్ని తానై చిన్నరాష్ట్రాల సంఘీభావం తెచ్చి ఢిల్లీలో సోనియా గాంధీని కలిసి రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను చెప్పి రాష్ట్ర ఏర్పాటుకు ఆమెను ఒప్పించి ధీశాలి అని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అన్నభీమోజు నాగార్జునాచారి, కార్పెంటర్ యూనియన్ అధ్యక్షుడు మల్లికార్జునచారి, సూరోజు లక్ష్మణ్, రామాచారి, హనుమాచారి, నాయకులు ముదిరెడ్డి నర్సిరెడ్డి, శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.


మిర్యాలగూడ : జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి

● దేవరకొండ : స్థానిక మునిసిపాలిటీలో జయశంకర్ చిత్రపటానికి మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, విశ్రాంత ఉద్యోగ సంఘం భవనంలో అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహ, అంకం చంద్రమౌళి, స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షుడు వెంకటేశ్వర్లు (ఎన్‌వీటీ), స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు వేర్వేరుగా ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు కృష్ణ కిషోర్, జయప్రకాష్, శీనయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● చింతపల్లి : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాకాంత్‌శర్మ జయశంకర్ సార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హర్షద్, ఆర్ఐ సునీత, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్, దయాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

● హాలియా : మండలం నాయుడుపాలెం జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా సైదులురావుగౌతమ్ మాట్లాడుతూ జయశంకర్ తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. ఆయన సేవలు మరువలేనివి అన్నారు. కార్యక్రమంలో కట్టెబోయిన చిన గురవయ్య యాదవ్, రమావత్ చందర్, హీతీరాం, పోలేపల్లి నాగులు, మెగావత్ రాకేష్, ముకేష్, సైదులు, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే వంద రోజుల ప్రణాళిక

●మిర్యాలగూడ మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్


మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పరమైన అంశాలపై వంద రోజుల ప్రణాళిక కొనసాగుతోందని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పరిశుభ్రత, పచ్చదనంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. మునిసిపాలిటీ పరిధిలోని బోటింగ్, సుందరయ్య పార్కులలో రెండు నర్సరీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గృహ నిర్మాణాల అనుమతులను త్వరితగతిన జారీ చేసేలా, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న ఇళ్లకు వెనువెంటనే నీటి కనెక్షన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఆస్తి, నీటి పన్ను వసూళ్లను ముమ్మరం చేశామని, ఆర్థిక సంవత్సర అర్థభాగానికి యాభై శాతం కలెక్షన్ టార్గెట్ పెట్టుకున్నట్లు వివరించారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో పట్టణంలోని పలు వార్డులలో మరమ్మతు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. స మావేశంలో అధికారులు జ్ఞానేశ్వరి, వెంకటరమణ, వెంకన్న, చరణ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి : బీజేపీ

డిండి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల పాలన ముగిసి 18 నెలలు గడిచినప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం సాకులు చెబుతూ కాలయాపన చేస్తుందని ఆయన అన్నారు. గ్రామాల్లో ప్రజలకు కనీస వసతులులేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామాలలో పాలానాధికారం ప్రత్యేక అధికారులు, కార్యదర్శులకు ఇచ్చి వారికి నిధులు కేటాయించకుండా గ్రా మాల్లో అధికారులు వసతులు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,517 కోట్లు వెనక్కి వెళ్లాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరం నిధులు కూడ వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని తెలిపారు.


కొండమల్లేపల్లి : ఇంటింటి ప్రచారంలో బీజేపీ నాయకులు

● కొండమల్లేపల్లి : మండలంలోని కొర్రోనితండాలో బీజేపీ మహా సంపర్క్ అభియాన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు భూతరాజు భరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జంగిటి మల్లేష్‌యాదవ్, వశ్యనాయక్, చందునాయక్, సయ్యద్ అలీ, చందు, రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణ షురూ

(5వ పేజీ తరువాయి)

తరుణంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయడమే మంచిదని ప్రభుత్వం భావించి పలు పరికరాలను సబ్సిడీపై అందించనుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంలో కేంద్ర భాగస్వామ్యం కూడా ఉండగా, ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

రైతులు కోరిన పరికరం మంజూరు

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులు కోరిన కంపెనీకి సంబంధించిన పరికరమే అందజేస్తారు. రైతుల నుంచి డీడీలు తీసుకొని రాయితీ ద్వారా ఆయా కంపెనీల నుంచి పరికరాలు తెప్పించి అందించనున్నారు. ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఉమ్మడి రాష్ట్రం నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకం కొనసాగుతుండగా, ఆరేళ్లుగా ఈ పథకం నిలిచింది. దీంతో రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించే అవకాశాలు లేకుండా పోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గత ఏడాది యాసంగి నుంచే రైతులకు రాయితీపై యం త్రాలను అందజేయాలని నిర్ణయించింది. రైతులకు అవసరమైన ఉపకరణాలు, యంత్రాలను రాయితీపై సరఫరా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయడమే గాక జిల్లాల వారీగా రైతుల నుంచి ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోనుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల వ్యవసాయ అధికారుల నుంచి నివేదికలు తీసుకుంది. రైతులకు అందజేయాల్సిన పనిముట్లు, మొత్తం 15 రకాల యంత్ర పరికరాల జాబితాను వ్యవసాయశాఖ అధికారులు రూపొందించారు.

అందులో రోటర్‌వేటర్లు, నాగళ్లు, కల్టీవేటర్లు, స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, డ్రోన్లు ఉన్నాయి. అర్హులైన ప్రతీ రైతుకు ఈ పథకాన్ని వర్తింపజేసేందుకు పలు ఆధునిక పరికరాలను అధికారులు అందించనున్నారు. అయితే ఈసారి ట్రాక్టర్లను ఈ పథకం కింద కేటాయించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్ల మంజూరు వివాదాస్పదం అయింది. దీంతో ప్రభుత్వం ట్రాక్టర్లను ఈ పథకంలో చేర్చలేదు.

వేంకటేశ్వరస్వామి అనుగ్రహం పొందాలి


పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరిపై వేంకటేశ్వరస్వామి అనుగ్రహం పొందాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని గౌరికుంటతండాల వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో కేసాని లింగారెడ్డి, రమావత్ తులసిరాం, రమావత్ దీప్లానాయక్, రమేష్, కృష్ణ, పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వేములపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దని, ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దీన సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● డిండి : డిండి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు, సిబ్బందికి ఎస్ఐ బాలకృష్ణ బుధవారం అవగాహణ కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్‌కు వచ్చే లింకులను, అపరిచిత ఫోన్‌కాల్స్‌ను లిఫ్ట్ చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శిరీష, సిబ్బంది ఉన్నారు.

● చింతపల్లి : సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి ఎస్ఐ ఎం.రాంమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్)లో పోలీస్‌శాఖ, మెడికల్ బృందంతో భారతి, వెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించామన్నారు. సైబర్ నేరాల బారిన పడినవారు 1930కి కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నూదినమోని హన్మంతు, పాల్గొన్నారు.